ANN తెలుగు
Follow: @ANNTELUGU
17-11-2025
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 329 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## రామోజీ గ్రూప్ సంస్థలు తెలంగాణకు గర్వకారణం: సీఎం రేవంత్‌రెడ్డి

**మహా:** రామోజీ గ్రూప్ సంస్థలు తెలంగాణకు గర్వకారణంగా నిలిచాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు దివంగత రామోజీరావు మహోన్నత వ్యక్తి, బహుముఖ ప్రజ్ఞాశాలని పలువురు ప్రముఖులు కీర్తించారు. హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో 2025 రామోజీ ఎక్సలెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖులు పాల్గొని రామోజీ రావు సమాజానికి చేసిన సేవని గుర్తు తెచ్చుకున్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ సీజే ఎన్వీరమణ, ఏపీ సీఎం చంద్రబాబునాయుడుతో పాటు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, బండి సంజయ్ అనేకమంది దిగ్గజాలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ నగరమంటే నాలుగు అద్భుతాలు గుర్తొస్తాయని.. అందులో మొదటిది ఛార్మినార్, రెండోది గోల్కొండ, మూడోది హైటెక్ సిటీ, నాలుగు.. రామోజీ ఫిల్మ్‌సిటీ అని సీఎం చెప్పారు. తెలుగు సినీ పరిశ్రమ ఆస్కార్ అవార్డుల వరకు ఎదిగిందంటే ఇందులో రామోజీ ఫిల్మ్ సిటీ ఎంతో తోడ్పాటునందించిందని సీఎం తెలిపారు.

మిగతా 2లో

### టాప్ న్యూస్

**పదోసారి సీఎంగా నితీష్**
- 20న ప్రమాణం చేసే ఛాన్స్
- మంత్రి పదవులపై ఫార్ములా ఖరారు



02

**జూబ్లిహిల్స్ ఫలితంతో హిందువుల్లో కసి పెరిగింది**
- కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



02

**షేక్ చేస్తున్న వారణాసి**
- మహేష్ జక్కన్న మూవీపై పూనకాలు



02



# స్థానికానికి సై

## డిసెంబర్‌లో ఎన్నికలు

### నేడు కేబినెట్ సమావేశంలో నిర్ణయం

- బీసీ రిజర్వేషన్ల కోసం చరిత్రలో ఎవరూచేయని ప్రయత్నాలు చేసిన సీఎం
- పార్టీ తరపున బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించే అవకాశం
- గవర్నర్ కు మరోసారి అప్పీల్.. బీసీ సంఘాలతో భేటీకి మంత్రుల టీమ్
- ప్రజాప్రభుత్వ ద్వితీయ వార్షిక వేడుకల ఏర్పాట్లు.. గ్లోబల్ సమ్మిట్ పై చర్చ

**హైదరాబాద్, మహా:**

జూబ్లీహిల్స్ ఊపులో ఉన్నతెలంగాణ సర్కార్ స్థానిక సంస్థల ఎన్నికలకు సై అంటోంది. రాష్ట్రంలో పరిస్థితులు ఎలా ఉన్నా ఎన్నిక విషయానికొచ్చేసరికి కాంగ్రెస్ శ్రేణులంతా ఏకతాటిపైకి వచ్చి గెలిపించుకునే సంప్రదాయం ఉండగా, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ బంపర్ మెజారిటీ సాధించి విపక్షానికి దిమ్మతిరిగే షాకిచ్చింది. ఇదే ఊపులో స్థానిక ఎన్నికలకు వెళ్ళి ఏకపక్ష విజయాలు సాధించాలని నేతలు భావిస్తున్నారు. తాజా పరిస్థితుల ప్రకారం డిసెంబర్ లో స్థానిక ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. అయితే స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ల అంశం చిక్కుముడిలా ఉండడంతో ఏం చేయాలన్న అంశంపై సర్కారు మల్లగుల్లాలు పడుతోంది. 50శాతం రిజర్వేషన్ల పరిమితి దాటేందుకు అంగీకరించమని హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంపై

మిగతా 2లో


**నేడు కేబినెట్ భేటీలో నిర్ణయం**

నేడు తెలంగాణ మంత్రివర్గం భేటీ కానుంది. ఇందులో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చించనుంది. బీసీ రిజర్వేషన్ల అమలు, హైకోర్టు తీర్పుతో పాటు మిగతా అంశాలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉంది. ఎన్నికల నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడో జరగాల్సి ఉంది. కానీ బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం చాలా రోజులుగా కసరత్తు చేస్తోంది. అసెంబ్లీలో తీర్మానం చేయటంతో పాటు ప్రత్యేకంగా జీవోను కూడా జారీ చేసింది. అయితే సర్కార్ తీసుకొచ్చిన జీవోపై కోర్టులు స్టే ఇవ్వటంతో 42 శాతం రిజర్వేషన్లపై సందిగ్ధత నెలకొంది. అప్పట్నుంచి ఎన్నికల నిర్వహణ పెండింగ్ లోనే ఉండిపోయింది.

# గులాబీ పార్టీకి భారీ ఝలక్?

## బిఆర్ఎస్ ఎమ్మెల్యేల జంపింగ్‌లపై జోరు ప్రచారం

- గతంలో సీఎంను కలిసిన నలుగురు మెదక్ ఎమ్మెల్యేలు
- ఆ గ్రూపులో ఒకరు చేరిక.. చర్చల్లో మరికొందరు
- సీఎంపై ఇటీవల ప్రశంసలు కురిపించిన అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు
- సిటీలో గ్రౌండ్ మారిందని భావిస్తున్న ఎమ్మెల్యేలు
- మైనారిటీ, టీడీపీ ఓటు బ్యాంకు టర్న్ కావడంపై ఆందోళన
- బీఆర్ఎస్ కుటుంబ పంచాయతీల నేపథ్యంలో
- కాంగ్రెస్ సేఫ్ గా భావిస్తున్న పలువురు ఎమ్మెల్యేలు
- రేవంత్ నాయత్వమే ఫ్యూఛర్ గా భావిస్తున్న పలువురు




**హైదరాబాద్ -మహా:**

జూబ్లీహిల్స్ గెలుపు సిటీలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో కలవరం కలిగిస్తోందా? మారుతున్న రాజకీయ పరిణామాల్లో మారకపోతే.. సోషల్ భ్రమల్లో నిండా మునుగుతామని నేతలు భావిస్తున్నారా? అంతర్గతంగా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఫ్యూచర్ పై తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రధానంగా ఇంతకాలం కాపుకాసిన ఓటుబ్యాంకులు అనూహ్యంగా పక్కకు జరుగుతుండడం, పార్టీ అధినేత కుటుంబంలో తగాదాలు వెరసి.. సొంతదారి చూసుకునేలా నేతలను ప్రోత్సహిస్తున్నారు.

మిగతా 2లో

## అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ రైజింగ్ సమ్మిట్

### గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లు చేస్తున్నాం

- తెలంగాణ రైజింగ్ – 2047 విజన్ డాక్యుమెంట్'ను ప్రపంచ దేశాలకు పరిచయం చేస్తాం
- రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి
- అధికారులతో కలిసి గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఏర్పాట్లు పరిశీలన



**హైదరాబాద్, మహా:** "తెలంగాణ రైజింగ్ 2047" విజన్ డాక్యుమెంట్‌ను ప్రపంచానికి పరిచయం చేస్తామని రాష్ట్ర డిప్యూటీ సీం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సాధించిన విజయాలను చాటి చెప్పడమే కాకుండా, 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలి,

మిగతా 2లో

## బీఆర్ఎస్ నేత పుట్టా మధుకు సీబీఐ షాక్

### రామగుండంలోని నేడు విచారణ

- లాయర్ వామనరావు దంపతుల హత్యకేసులో కీలక దశ
- ఇప్పటికే అనేకమంది సాక్షులను విచారించిన సీబీఐ

**హైదరాబాద్, మహా :** పెద్దపల్లి జిల్లాలో దాదాపు ఐదేళ్ళ క్రితం జరిగిన లాయర్ దంపతుల హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. హత్యకేసు విచారణకు హాజరవ్వాల్సిందిగా బీఆర్ఎస్ మాజీ ఎంఎల్ఏ పుట్టా మధుకు సీబీఐ నోటీసులు జారీచేసింది. హత్య కేసును విచారిస్తున్న సీబీఐ సోమవారం పుట్టా మధుకర్ ను విచారణకు రమ్మని నోటీసులో చెప్పింది. రామగుండంలోని స్థానిక సీబీఐ ఆఫీసులో విచారణకు హాజరవ్వాలని నోటీసులో స్పష్టం చేసింది. హత్యకేసు విచారణలో భాగంగానే రామగుండంలో సీబీఐ తాత్కాలికంగా ఆఫీసును ఏర్పాటు చేసుకున్న



ది. హత్య కేసు విచారణలో సాక్షులు, అనుమానితులందరినీ రామగుండం ఆఫీసులోనే సీబీఐ విచారిస్తోంది.

మిగతా 2లో

## సూక్మా జిల్లాలో తుపాకుల మోత

- భారీ ఎన్‌కౌంటర్
- ముగ్గురు మావోయిస్టులు మృతి, మృతుల్లో ఇద్దరు మహిళలు
- కొనసాగుతున్న కూంబింగ్

వివరాలు 2లో

## పత్రికలు సానుకూల వార్తలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- నేతలు దారి తప్పుతున్నట్లయితే సరిదిద్దాలి
- సోషల్ మీడియాలో జవాబుదారీతనం పెరగాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచన
- వెటరన్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ పుస్తకాలు 'అనుభవాలుజ్ఞాపకాలు', 'అప్పుడుఇప్పుడు', ఆవిష్కరణ




02

## సీఎం రేవంత్ వ్యూహంతోనే జూబ్లీహిల్స్ గెలుపు

- రెండేళ్ళ పనితీరు బేరీజ వేసి కలుపుమొక్కలను తొలగించండి
- ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్ హాట్ కామెంట్స్

02



# గులాబీపార్టీకి భారీ ఝలక్ ?

(మొదటిపేజీ తరువాయి)

ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ ఫలితాలు వచ్చినరోజే.. గతంలో తమతో జాయినింగ్ కోసం సంప్రదించిన కాంగ్రెస్ నేతలకు టచ్ లోకి వెళ్లినట్లు తెలిసింది. ఢిల్లీలో హైకమాండ్ కు కూడా ఈ విషయం చేరవేసినట్లు తెలిసింది. అయితే ఐదు, పది మంది కాకుండా.. విలీనానికి ఎంతమంది అవసరమో అంతమంది వస్తే చర్చుకుంటామని డిసైడ్ అయినట్లు తెలిసింది. కాంగ్రెస్ అంటే స్వేచ్ఛ ఉంటుందని, దేశ రాజకీయాలు ఎలా ఉన్నా.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని రక్షించుకునేందుకు అనేక సురక్షిత వలయాలు ఉన్నట్లు నేతలు భావిస్తున్నారు. కొందరు నేతలకు కేటీఆర్ తీరుపై తీవ్ర అసంతృప్తి ఉంది. అధికారం కోల్పోయాక కూడా ఇంకా అధికారంలో ఉన్నట్లు ప్రవర్తిస్తున్నారని, జిల్లా పరిస్థితుల నేపథ్యంలో కొందరికి ప్రాధాన్యం దక్కడం లేదని, గతంలో హామీలిచ్చిన అనేక పనులు చేయలేదని.. ముఖం చాటేశారని, మోసం చేశారని పలువురు ఎమ్మెల్యేలు అంతర్గత సంభాషణల్లో అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సిటీలో వరుసగా కాంగ్రెస్ ఎమ్మెల్యే స్థానాలు గెలుస్తుండగా, సోషల్ మీడియాలో తప్ప గ్రౌండ్ లో బీఆర్ఎస్ ప్రతిపక్షంగా వ్యవహరించిన పరిస్థితులు లేవన్నది రెండేళ్ళ ప్రోగ్రెస్ రిపోర్ట్.. రెండేళ్ళలో బీఆర్ఎస్ సాధించింది గుండుసున్నానే. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలలో బీజేపీ గెలవగా, ఎమ్మెల్యే స్థానాలు కాంగ్రెస్ గెలుస్తోంది. ఇక బీఆర్ఎస్ కు చోటెక్కడ అన్నది నేతల్లో కలవరం కలిగిస్తోంది. ఈ క్రమంలోనే పార్టీ మార్పుకు నేతలు పన్నాహాలు చేసుకుంటున్నారు.

**బీఆర్ఎస్ ది విలీనాల దారే**

బీఆర్ఎస్ రెండు టర్మ్ లలోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను వెంటాడి తమ పార్టీలో కలిపేసుకుంది. టీడీపీ పక్షాన్ని కూడా వెంటాడి కలిపేసుకుంది. ఇపుడు వెంటాడకుండానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు భవిష్యత్ కోసం కలవబోతున్నారని, కర్మ రిటర్న్ అంటే ఇదేనని పలువురు నేతలు విశ్లేషిస్తున్నారు. గతంలో మెదక్ జిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డిని ఇంటివద్ద కలిశారు. వీరిలో ఒకరు తర్వాత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మిగతా ముగ్గురిలో పలువురు చేరబోతున్నట్లు ఇపుడు ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు ఓటు బ్యాంకు మార్పులుచేర్పులతో సిటీలోని అనేకమంది ఎమ్మెల్యేలు ఇటు చూస్తున్నారు. కూ అంటున్న కూకట్ పల్లి, సై అంటున్న సనత్ నగర్ అంటూ సోషల్ మీడియా గ్రూపుల్లో ప్రచారాలు జరుగుతున్నాయి. పలువురు ఎమ్మెల్యేలపై ఆంతరంగికులు ఒత్తిడి తెస్తున్నారు. అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఇటీవల బతుకమ్మ కుంట పునరుజ్జీవ కార్యక్రమంలో సీఎంపై ప్రశంసలు కురిపించారు. మరికొందరు ఎమ్మెల్యేలు కూడా కుటుంబసంబంధాలతో ముఖ్యనేతలకు టచ్ లో ఉన్నారు.

**సీఎం రేవంత్ పనితీరుతోనే షాక్**

ముఖ్యంగా జూబ్లీహిల్స్ గెలుపు కోసం సీఎం అమలు చేసిన వ్యూహాలు, ఎన్నికను ఎదుర్కొన్న తీరు నేతలను షాక్ కు గురిచేసింది. ఒక్కసారిగా అభిప్రాయాలను మార్చేసింది. అందెశ్రీ విషయంలో, నవీన్ యాదవ్ విషయంతో పాటు.. నమ్ముకున్న వారికి అండగా ఉండే విషయంలో సీఎం ఒక్కసారి మాటిస్తే నెరవేరినట్లేనన్న భావన వ్యాప్తి చెందింది. దీంతో రేవంత్ కాంగ్రెస్ తో భవిష్యత్తు ఉంటుందంటూ నేతలు టచ్ లోకి వచ్చి ముహూర్తం కోరుతున్నట్లు ప్రచారం ఉంది. ఎన్నికల్లో గెలుపుకు కనెక్ట్ చేసే తీరు, ఆపరేట్ చేసే పద్ధతి నేతలను ముగ్ధులను చేసింది. దీంతో కేసీఆర్ కు, బీఆర్ఎస్ కు త్వరలోనే కర్మ రిటర్న్స్ అన్నట్లు షాక్ విలీన షాక్ తగలడం ఖాయమన్న చర్చ ఉంది. స్థానిక ఎన్నికలకు ముందే చేరితే తమ అనుచరులను గెలిపించుకోవొచ్చని పలువురు యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

**కుటుంబ విభేదాలతో తలనొప్పి**

కేసీఆర్ కుటుంబ విబేధాలు రచ్చకెక్కాయి. కేసీఆర్ కూతురిని పార్టీ సస్పెండ్ చేసింది. ఆమె గొంతెత్తి నేరుగా హరీష్ రావు, కేటీఆర్ ల తీరుపై ఘాటు వ్యాఖ్యలు చేస్తుండడంతో గ్రౌండ్ లో నేతలు తలెత్తుకోలేని పరిస్థితి ఉన్నది. ఇక కేసీఆర్ ఫాంహౌజ్ ను వీడి బయటకు రాకపోగా, కేసీఆర్ కనీసం మాగంటి సునితను గెలిపించమని విజ్ఞప్తి చేయలేదు. దీంతో ఇలాంటి పరిస్థితులన్నీ తమ భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయని బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు చెందుతున్నారు.

# స్థానికానికి సై

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర సర్కారు మల్లగుల్లాలు పడుతోంది. బీసీ రిజర్వేషన్ల కోసం చరిత్రలో ఎవరూ చేయనంత ప్రయత్నం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. అయితే ఇది పార్లమెంట్ తీసుకోవాల్సిన నిర్ణయం కావడంతో ఆశించిన ఫలితం లేదు. ఈ క్రమంలో ప్రత్యామ్నాయంగా పార్టీ పరంగా 42 శాతం సీట్లు బీసీలకు ఇచ్చే ప్రతిపాదన ముందునుండీ ఉంది. గవర్నర్ కు మరోసారి అప్పీల్ చేయడంతో పాటు బీసీ సంఘాలతో ఏం చేయాలన్న అంశంపై చర్చించేందుకు మంత్రుల టీమ్ కు బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

**కేబినెట్ లో చర్చ ఆపై నిర్ణయం!..**

రిజర్వేషన్ల పరిమితిపై స్పష్టమైన కోర్టు తీర్పులు ఉండటంతో... బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వపరంగా అమలు చేయటం ఇబ్బందికరంగానే మారింది. ఇలాంటి పరిస్థితులను అధిగమించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకువస్తోంది. తమ పార్టీపరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధమనే సంకేతాలు ఇస్తోంది. అయితే ఈ అంశంపై మంత్రివర్గంలో లోతుగా చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. 17వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో ఈ ఎన్నికలపై చర్చిస్తామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రకటించారు.

**జూబ్లీహిల్స్ గెలుపుతో జోష్**

ప్రస్తుతం జూబ్లీహిల్స్ గెలుపుతో మంచి జోష్ లో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇక ఆలస్యం చేయకుండా స్థానిక ఎన్నికలకు వెళ్లాలని యోచిస్తోంది. ఇప్పటికే ఆలస్యమైన నేపథ్యంలో... ఇకపై ఆలస్యం కాకుండా ఎన్నికలు నిర్వహించాలని గట్టిగా భావిస్తోంది. పార్టీ పరంగానే 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామనే ప్రకటన కాంగ్రెస్ నుంచి రావొచ్చన్న వాదనలు, విశ్లేషణలు చాలా రోజులుగా వినిపిస్తున్నాయి. దాదాపు ఇదే నిర్ణయాన్ని ప్రకటించి... కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు వెళ్లే అవకాశం కూడా కనిపిస్తోంది. ఇలా కాకుండా మరేమైనా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందా అనేది నేటి కేబినెట్ భేటీ తర్వాత తెలుస్తుంది. రిజర్వేషన్లతో పాటు డిసెంబర్ లో నిర్వహించనున్న ప్రజాపాలన వారోత్సవాలు, గ్లోబల్ సమ్మిట్, తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ వంటివన్నీ తెలంగాణ ఫ్యూచర్ కు దిశానిర్దేశం చేయనున్నాయి.

# షేక్ చేస్తున్న వారణాసి

## మహేష్ జక్కన్న మూవీపై పూనకాలు

**మహా:** రామోజీ ఫిల్మ్‌సిటీలో అట్టహాసంగా నిర్వహించిన 'గ్లోబ్ ట్రోటర్' ఈవెంట్‌తో వారణాసి సినిమా ప్రపంచాన్ని ఆకర్షించింది. మహేశ్‌బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న ఈ పాన్వ రల్డ్ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. ఈవెంట్‌లో మహేశ్ బాబు ఎద్దుపై కనిపించిన గ్లింప్స్, ప్రియాంక చోప్రా "మందాకిని" ఫస్ట్ లుక్, పృథ్వీరాజ్ "కుంభ" పాత్ర అన్నీ ప్రేక్షకుల్లో హాలీవుడ్ స్థాయి విజువల్ అంచనాలు రేకెత్తించాయి. టీజర్, పోస్టర్లు, కాన్సెప్ట్ వివరాలు అన్నీ సినిమా స్కేల్‌ని మరింత పెంచాయి. సూపర్ స్టార్ ఫ్యాన్స్ సమక్షంలో ఈవెంట్ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఇక ఈవెంట్ లో రిలీజ్ చేసిన వారణాసి గ్లింప్స్ తో ఫ్యాన్స్ మైండ్ బ్లాక్ అయ్యింది. టీజర్ లో ఎలాంటి డైలాగ్స్ లేకుండా విజువల్స్ తోనే పిచ్చెక్కించాడు జక్కన్న. దీంతో మహేష్ జక్కన్న మూవీ ఇండియాలోని ప్రతి ఇంటి నుండి వచ్చి చూస్తారని, పూనకాలతో దేశ ఊగిపోతుందని విశ్లేషకులు పోస్టులు పెడుతున్నారు.

# రామోజీ గ్రూప్ సంస్థలు తెలంగాణకు గర్వకారణం

## సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

ఉదయం లేవగానే ఈనాడు పేపర్ చదవడం.. రాత్రి ఈటీవీ న్యూస్ చూసి నిద్రపోవడం తెలుగు ప్రజలకు రామోజీరావు అలవాటుగా మార్చారని రేవంత్ తెలిపారు. రామోజీతో తన జ్ఞాపకాలు పంచుకున్నారు. 2009లో తమ ప్రభుత్వం ఏర్పాటవుతుందన్న ఆలోచనతో మంత్రి పదవి కోసం రామోజీని కలిసిన విధానం చెప్పి సభికులను నవ్వించారు.

**రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ఆలోచన ప్రశంసనీయం: చంద్రబాబు**

రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు పేరిట ఏర్పాటు చేసిన రామోజీ ఎక్సలెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమం ప్రశంసనీయమని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. జర్నలిజం, గ్రామీణాభివృద్ధి, మానవ సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కళసంస్కృతి, మహిళా సాధికారత, యూత్ ఐకాన్ విభాగాల్లో అవార్డులివ్వడం హర్షణీయమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. సమాజసేవలో ప్రజల్ని భాగస్వాములను చేసిన వ్యక్తి రామోజీరావు అని.. ఎలాంటి విపత్తు వచ్చినా తనదైన శైలిలో సేవలు అందించారని చంద్రబాబు తెలిపారు.

# జూబ్లిహిల్స్ ఫలితంతో హిందువుల్లో కసి పెరిగింది

## కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా :** జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక ఫలితం తర్వాతనైనా హిందువులంతా ఏకం కావాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. రాష్ట్రంలో ఉన్న హిందువులంతా ఓటు బ్యాంకుగా మారాలని పిలుపునిచ్చారు. ఆదివారం కూకట్ పల్లిలో నిర్వహించిన కాపు కులస్తుల కార్తీక వన భోజనాల కార్యక్రమానికి హాజరైన ఆయన జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితంపై కీలక వ్యాఖ్యలు చేశారు. జూబ్లిహిల్స్ ఫలితం తరువాత హిందువుల్లో కసి పెరిగిందన్నారు. అక్కడ ముస్లింలకు కొమ్ము కాసే దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఇకనైనా హిందువులు మేల్కొని ఓటుబ్యాంకుగా మారాలన్నారు. మతాలను మార్చుకుంటే దేవుళ్లను మోసం చేసినట్లేనని, తెలుగు రాష్ట్రాల్లో ఇతర మతాల్లో చేరిన వారంతా ఘర్ వాపసీ రావాలని కోరారు. హిందూ మతంలోకి తిరిగి వచ్చేవారి కోసం హిందూ ధర్మ రక్షణ ద్వారాలు తెరిచే ఉన్నాయన్నారు. హిందూ సనాతన ధర్మం ఎంతో గొప్పదని, హిందువుగా పుట్టడం మనందరికీ గర్వకారణమన్నారు. అన్ని కులాలు తమ సామాజికవర్గ సంక్షేమానికి పాటు పడుతూ హిందూ ధర్మం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. హిందూ సనాతన ధర్మ రక్షణే తన లక్ష్యమని బండి సంజయ్ తెలిపారు. పవన్ కళ్యాణ్ సనాతన ధర్మ ప్రచారం వల్ల ఇతర మతాల్లో చేరిన హిందువుల్లో పునరాలోచన వస్తోందన్నారు. మోసపోయి ఇతర మతాల్లో చేరిన హిందువులను ఆదుకునే బాధ్యత తనదన్నారు. ఇక కార్తీక వనభోజనాలు నిర్వహిస్తోన్న అన్ని కులాల సభ్యులకు అభినందనలు తెలిపారు. అన్ని కులాలు హిందూ సనాతన ధర్మ రక్షణ కోసం కృషి చేయాలని కోరారు.



# పదోసారి సీఎంగా నితీష్

## 20న ప్రమాణం చేసే ఛాన్స్

### మంత్రి పదవులపై ఫార్ములా ఖరారు

**బీహార్, మహా:** మరోసారి బిహార్ ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్ కొనసాగుతారని కూటమి వర్గాలు పేర్కొన్నాయి. నవంబర్ 20న కొత్త ప్రభుత్వం కొలువు తీరే అవకాశం ఉంది. ఇందుకు పట్నాలోని గాంధీ మైదానం వేదిక కానున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు హాజరయ్యే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం గాంధీ మైదానంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నితీష్ కేబినెట్ లో మెజార్టీ మంత్రి పదవులు బీజేపీకే..! బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం ఆదివారం గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌కు సమర్పించనుందని.. ఆ తర్వాత కొత్త అసెంబ్లీ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈనెల 20న ప్రమాణస్వీకారం ఉంటుందని ఎన్డీయే వర్గాల సమాచారం. సోమవారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో అసెంబ్లీ రద్దుకు ఆమోదం తెలిపే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత నీతీశ్ తన రాజీనామాను గవర్నర్‌కు సమర్పిస్తారు. తద్వారా కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు చర్యలు ప్రారంభమవుతాయి. కొత్త ప్రభుత్వంలో మంత్రివర్గ కూర్పు కోసం కేంద్రమంత్రి అమిత్‌షాతో కూటమి నేతలు శనివారం సమావేశమైనట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలో బీజేపీకి సింహభాగం వాటా దక్కే అవకాశం ఉన్నట్లు కూటమి వర్గాలు పేర్కొన్నాయి. తర్వాతి స్థానంలో జేడీయూ ఇతర పార్టీలు ఉన్నాయి. కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్)కి మూడు మంత్రి పదవులు ఇవ్వనున్నట్లు సమాచారం.

# అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ రైజింగ్ సమ్మిట్

## గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లు చేస్తున్నాం

### తెలంగాణ రైజింగ్ – 2047 విజన్ డాక్యుమెంట్'ను ప్రపంచ దేశాలకు పరిచయం చేస్తాం

### రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

### అధికారులతో కలిసి గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఏర్పాట్లు పరిశీలన



(మొదటిపేజీ తరువాయి)

ఎలా ఉండబోతుంది అనే దీర్ఘకాలిక దృష్టి 'తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ డాక్యుమెంట్'ను ప్రపంచ దేశాలకు, పెట్టుబడిదారులకు పరిచయం చేయనున్నట్లు తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీలోని 100 ఎకరాల విశాలమైన ఓపెన్ ల్యాండ్‌తో పాటు హైటెక్స్, గచ్చిబౌలి, దుండిగల్ తదితర ప్రాంతాల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ వేదికలను పరిశీలించారు. అనంతరం మీడియాతో భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. మొదటి ఏడాది ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు ద్వారా సాధించిన ఘన విజయాలను రాష్ట్ర ప్రజల ముందుంచామని అన్నారు. రెండవ ఏడాది మరింత వేగంగా అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే అగ్రగామిగా నిలిచామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో 2047 తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ను ప్రపంచస్థాయి గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరించాలని ఏకగ్రీవ తీర్మానం చేశామని తెలిపారు. ఈ సమ్మిట్ ద్వారా రాష్ట్ర ప్రజలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నామని వివరించారు. హైదరాబాద్ పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన, ప్రపంచంలోనే పేరుగాంచిన నగరమన్నారు. అద్భుతమైన వాతావరణం, నైపుణ్యం గల యువత, తక్కువ ఖర్చుతో అత్యుత్తమ మానవ వనరులు ఉన్నాయని, ఇవన్నీ హైదరాబాద్‌లో ఒకేచోట అందుబాటులో ఉన్నాయి.. ఈ అవకాశాన్ని ప్రపంచ పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, వికాస్ రాజ్, శశాంక, నర్సింహారెడ్డి, కృష్ణ భాస్కర్, ముషారఫ్ అలీ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పత్రికలు సానుకూల వార్తలకు ప్రాధాన్యం ఇవ్వాలి

## నేతలు దారి తప్పుతున్నట్లయితే సరిదిద్దాలి

### సోషల్ మీడియాలో జవాబుదారీతనం పెరగాలి.. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచన

### వెటరన్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ పుస్తకాలు' అనుభవాలుజ్ఞాపకాలు', 'అప్పుడుఇప్పుడు', ఆవిష్కరణ



**హైదరాబాద్, మహా :** వికసిత్ భారత్ నిర్మాణం లో పత్రికలు, పాత్రికేయులు ప్రముఖ పాత్ర పోషించాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సూచించారు. ఓటర్ల జాబితాను పరిశీలించి వాటిలో మార్పులు చేర్పులు సూచించాల్సింది పార్టీల కార్యకర్తలేనని స్పష్టం చేశారు. హైదరాబాద్ లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో వెటరన్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రచురించిన రెండు విశిష్టమైన పుస్తకాలు' అనుభవాలుజ్ఞాపకాలు', 'అప్పుడుఇప్పుడు', లను ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ "స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ప్రజలను ఏకం చేయడానికి, వారిలో జాతీయ స్ఫూర్తిని నింపడానికి, బ్రిటీష్ దురాగతాలను ప్రశ్నించడానికి ఏకైక ఆయుధం మన పత్రికలే, ఎన్నో పత్రికలు కేవలం కాగితపు ముక్కలు కావు; అవి అగ్ని కణాలుగా పని చేశాయి. పాత్రికేయులు దేశ నిర్మాణంలో మళ్లీ ప్రముఖ పాత్ర పోషించాల్సిన సమయం వచ్చింది. వికసిత భారత్ దిశగా మన దేశ ప్రయాణంలో అత్యంత కీలకమైన పాత్రను పత్రికా రంగం పోషించాలి. సానుకూల సమాచారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అదే సమయంలో ప్రభుత్వంలో ఏమన్నా లోటుపాట్లు ఉంటే విమర్శలు చేయాలి. రాజకీయ పార్టీలు, రాజకీయ నేతల పోకడ సరిగా లేకుంటే సరిదిద్దాల్సిన బాధ్యతను పత్రికలు, పాత్రికేయులు తీసుకోవాలి." అని చెప్పారు. పత్రికలు, రాజకీయ పార్టీలు సమాజ హితమే ధ్యేయంగా పనిచేయాలన్నారు.

"రాజకీయ పార్టీలకు సిద్ధాంత నిబద్ధత అవసరం. ఏ పార్టీ కార్యకర్తలైనా క్షేత్రస్థాయిలో కష్టపడి, బాధ్యతతో పని చేయాలి. క్షేత్రస్థాయిలో వారు చురుకుగా ఉండాలి. ఎన్నికల సంఘం రూపొందించిన ఓటర్ల జాబితాను ఇంటింటికి తిరిగి పరిశీలించి మార్పులు, చేర్పులు సూచించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీల కార్యకర్తలపైనే ఉంది. అవసరమైతే మూడు నాలుగు సార్లు ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలి." అని వెంకయ్య నాయుడు సూచించారు. "నేను కార్యకర్తగా ఉన్నప్పుడు ఇలాగే ఇంటింటికి మూడు నాలుగు సార్లు తిరిగి పరిశీలించేవాడిని. ఇప్పుడు పార్టీలు అంత శ్రద్ధగా ఈ పని చేస్తున్నట్టు కనిపించడం లేదు." అని అన్నారు. పత్రికల్లో వాడే భాష, నేతలు మాట్లాడే భాష సంస్కారయుతంగా ఉండాలన్నారు. అసెంబ్లీలో, పార్లమెంటులో మాట్లాడేటప్పుడు భాష హుందాగా ఉండాలన్నారు. సత్యాన్ని తెలియజేసేదే జర్నలిజమని, వార్తలను వార్తలుగా మాత్రమే ఇవ్వాలని, అందులో అభిప్రాయాలను కలపకూడదని స్పష్టం చేశారు. తక్షణమే సమాచారాన్ని ప్రజల వద్దకు చేరడానికి సోషల్ మీడియా మంచి వేదికే అని, అయితే ఆ వేదికను చాలామంది దుర్వినియోగం చేస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో జవాబుతారీతనం ఉండేలా సరిదిద్దాలని స్పష్టం చేశారు. వయోధిక పాత్రికేయులు తమ అనుభవాలను 'అనుభవాలు జ్ఞాపకాలు' పుస్తకంలో గుదిగుచ్చగా, ఆనాటి మరో ప్రముఖ పాత్రికేయుడు జి.కృష్ణ (జీకే) రాసిన వ్యాసాలను 'అప్పుడుఇప్పుడు', పుస్తక రూపంలో తీసుకురావడం మంచి విషయమని అభినందించారు. పత్రికారంగంలో మార్పులను, మేధావుల అనుభవాలను రికార్డు చేసిన ఈ కృషి అభినందనీయమని, నేటితరం పాత్రికేయులు, మీడియా రంగంలో ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకాలు అని చెప్పారు. ఈ రెండు పుస్తకాలు గొప్ప రిఫరెన్సులుగా నిలుస్తాయన్నారు. తాను రాజకీయాల్లో ప్రవేశించిన తొలినాళ్లలో నాటి తరం పాత్రికేయులతో మాట్లాడటం ద్వారా చాలా విషయాలు నేర్చుకున్నానని వెంకయ్య నాయుడు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు వెంకటనారాయణ, జె.వి.లక్ష్మణ్, దాసు కేశవరావు, పి.ఎ.రామారావు, రాజశుక, కె.రామచంద్రమూర్తి, ఉడయవర్లు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేత పుట్టా మధుకు సీబీఐ షాక్

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికే వామనరావు తండ్రి కిషన్ రావుతో పాటు మృతుల కుటుంబ సభ్యులను, బంధువులతో పాటు పలువురు సాక్షులను కూడా సీబీఐ విచారించింది. ఇపుడు పుట్టా మధు విచారణకు నోటీసులు ఇవ్వటంతో కీలకపరిణామం చోటుచేసుకున్నది. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల దగ్గర 2021, ఫిబ్రవరి 17వ తేదీన మధ్యాహ్నం రోడ్డుమీదే లాయర్ దంపతులు గట్టు వామనరావు, పీవీ నాగమణి హత్య జరిగింది. హైకోర్టులో ప్రాక్టీసు చేస్తున్న లాయర్ దంపతులు ఒక కేసు వ్యవహారంలో పెద్దపల్లి కోర్టుకు హాజరయ్యారు. కోర్టు నుండి బయటకు వచ్చి రోడ్డుమీద కారులో వెళుతున్న లాయర్ దంపతుల కారును మరో కారులో కొందరు అడ్డగించారు. లాయర్ల కారు దగ్గరకు వచ్చి ముందు వామనరావును కత్తులతో నరికేశారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన ఆయన భార్య నాగమణిని కూడా కత్తులతో నరికేశారు. కత్తిపోట్లతోనే తప్పించుకునేందుకు వామనరావు కారులో నుండి బయటకు వచ్చినా దుండగులు వదిలిపెట్టకుండా మళ్ళీ పొడిచారు. దాంతో రోడ్డుపైన వామనరావు, కారులో నాగమణి పడిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి వచ్చారు. పోలీసులతో వామనరావు మరణ వాగ్మూలం ఇస్తూ పుట్టా మధుకర్ పేరును ప్రస్తావించినట్లుగా ప్రచారంలో ఉంది. ఇదే విషయాన్ని వామనరావు తండ్రి గట్టు కిషన్ రావు కూడా కోర్టుకు చెప్పారు. నిష్పాక్షిక దర్యాప్తు జరగాలంటే సీబీఐ విచారణ జరగాల్సిందే అన్న కిషన్ రావు వాదనతో హైకోర్టు అంగీకరించలేదు. అయితే కిషన్ రావు సుప్రింకోర్టులో 2021, సెప్టెంబర్ 18వ తేదీన పిటీషన్ వేశారు. పిటీషనర్ వాదనను విన్న సుప్రింకోర్టు అన్ని విషయాలను పరిశీలించి కేసు విచారణను సీబీఐకి అప్పగించింది. సోమవారం సీబీఐ విచారణలో పుట్టామధుకర్ ఏమి చెబుతారన్నది సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

# సూక్మా జిల్లాలో తుపాకుల మోత

## భారీ ఎన్‌కౌంటర్

- ముగ్గురు మావోయిస్టులు మృతి, మృతుల్లో ఇద్దరు మహిళలు
- కొనసాగుతున్న కూంబింగ్



**చత్తీస్గఢ్, మహా :** చత్తీస్ ఘడ్‌లో మావోయిస్టులపై భద్రతా దళాలు మరోసారి పంజా విసిరాయి. సుక్మా జిల్లాలో ఆదివారం ఉదయం మావోయిస్టులు - భద్రతా బలగాల మధ్య భారీ స్థాయిలో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఎదురుకాల్పుల్లో ఇప్పటివరకు ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్లు సమాచారం. ఇంకా మరికొందరు మావోయిస్టులు దాడిలో చిక్కి ఉండొచ్చన్న అనుమానంతో పోలీసులు ఆ ప్రాంతాన్ని ముట్టడి చేశారు. లభించిన వివరాల ప్రకారం సుక్మా జిల్లా చింతగుఫా పోలీస్ స్టేషన్ పరిధిలోని కరిగుండం అటవీ ప్రాంతంలో పోలీసుల కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతుండగా మావోయిస్టుల సమూహం కాల్పులకు తెగబడ్డారు. దీంతో ఇద్దరు వైపులా గంటల పాటు కాల్పులు కొనసాగాయని సమాచారం. ఎన్‌కౌంటర్ ముగిసిన తర్వాత సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు పలు తుపాకులు, పేలుడు పదార్థాలు, మావోయిస్టుల సామగ్రిను స్వాధీనం చేసుకున్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని, అడవి ప్రాంతంలో ముమ్మర గాలింపు సాగుతోందని పోలీసులు వెల్లడించారు. సుక్మా - బీజాపూర్ అటవీ మండలాల్లో ఇటీవల మావోయిస్టుల కదలికలు పెరగడంతో భద్రతా దళాలు అప్రమత్తంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. మావోయిస్టుల వద్ద ఉన్న 303 రైఫిల్, బీజీఎల్ లాంచర్లు, ఇతర ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినవారిని మిలిషియా కమాండర్, ఏరియా కమిటీ సభ్యుడైన మద్వి దేవా, సీఎన్ఎం కమాండర్ పోడియం గంగి, కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడు సోడి గంగిగా గుర్తించారు. ఎన్‌కౌంటర్‌లో హతమైన మావోస్టులపై చెరో రూ.5 లక్షల రివార్డు ఉందని అధికారులు తెలిపారు. సుక్మా జిల్లాలోని భేజ్జీ, చింతగుఫా సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో జిల్లా రిజర్వ్‌గార్డ్ (డీఆర్‌జీ) ఆపరేషన్ ప్రారంభించింది. ఈ ఆపరేషన్ ఆదివారం ఉదయం తీవ్రరూపం దాల్చింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం నుంచి ఇరువైపుల నుంచి కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు. మృతుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. గతంలో అమాయక ప్రజలపై జరిగిన అనేక దాడుల్లో వీరి హస్తం ఉందని అధికారులు తెలిపారు.

**మరణించిన మావోయిస్టుల వివరాలను అధికారులు ప్రకటించారు. మద్వి దేవా**

ఇతడు మిలిషియా కమాండర్, ప్రసిద్ధ స్నిపర్, కొంటా ఏరియా కమిటీ సభ్యుడు. మద్వి దేవాపై రూ.5 లక్షల రివార్డు ఉంది. అనేక మంది అమాయక ప్రజలు ప్రాణాలు తీయడం, సైనికులపై దాడుల్లో మద్వి దేవా హస్తం ఉంది. పోడియం గంగి . సీఎన్ఎం కమాండర్ అయిన పోడియం గంగి, కొంటా ఏరియా కమిటీ సభ్యురాలు. ఆమెపై రూ.5 లక్షల రివార్డు ఉంది. సోడి గంగి సోడి గంగి కిష్టారామ్ ఏరియా కమిటీలో చురుకైన సభ్యురాలు. ఆమెపై రూడా రూ.5 లక్షల రివార్డు ఉంది.

**ఎన్ కౌంటర్ పై స్పందించిన ఐజీ సుందర్ రాజ్**

ఎన్‌కౌంటర్‌పై బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ పట్టిలింగం స్పందించారు. బస్తర్ ప్రాంతంలో మావోయిజం ఇప్పుడు చివరి దశలో ఉందన్నారు. మావోయిస్టు కేడర్ హింసను విడనాడి జనజీవన స్రవంతిలో కలిసిపోవడం తప్ప వారికి వేరే మార్గం లేదని తెలిపారు. నిర్ణీత సమయంలోపు బస్తర్‌లో నక్సలిజాన్ని నిర్మూలిస్తామన్నారు. సైనికుల ధైర్యం మావోయిస్టుల వ్యూహాన్ని విఫలం చేసిందన్నారు. "ఈ ఎన్‌కౌంటర్ మావోయిస్టులకు మరో పెద్ద ఎదురుదెబ్బ. 2025 లో ఇప్పటి వరకు 233 మంది మావోయిస్టులు హతమయ్యారు. వీరిలో ఉన్నత స్థాయి కేంద్ర కమిటీ సభ్యులు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ లీడర్లు ఉన్నారు." అని సుందర్ రాజ్ తెలిపారు.

# సీఎం రేవంత్ వ్యూహంతోనే జూబ్లీహిల్స్ గెలుపు

## రెండేళ్ళ పనితీరు బేరీజు వేసి కలుపుమొక్కలను తొలగించండి.. ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్ హాట్ కామెంట్స్

**హైదరాబాద్, మహా :** ప్రభుత్వ పనితీరు సీఎం రేవంత్ రెడ్డి వ్యూహం తో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచామని, కాంగ్రెస్ క్యాడర్ మూడునెలలుగా ఈ గెలుపుకోసం కష్టపడిందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. ఆదివారం గాంధీభవన్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ నాయకత్వం తో కాంగ్రెస్ పార్టీకి ప్రజలలో ఆదరణ ఉన్నదని స్పష్టం అయ్యిందని, వచ్చే ఎన్నికల కోసం పార్టీని ప్రభుత్వాన్ని వ్యవస్థలను ప్రక్షాళన చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గెలుపు అద్భుతమని, ఫ్యూచర్ కోసం పనితీరును బేరీజు వేసుకుని ప్రక్షాళన చేయాలని కోరారు. బి ఆర్ ఎస్ పై ప్రజా వ్యతిరేకతతో ప్రజలంతా ఉప్పెన లాగా వచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారం ఇచ్చారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 2 ఏళ్ల అవుతుందని, ఇప్పుడు అందరి పని తీరును బేరీజు వేసుకుని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. బి ఆర్ ఎస్ పై వ్యతిరేకత తో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చాలా మంది కాంగ్రెస్ పార్టీ లో చేరారన్నారు. కాంగ్రెస్ పార్టీ లో వచ్చిన వారిని పని తీరును చూసి పరీక్షించి ప్రక్షాళన చేయాలన్నారు. పార్టీ లో అక్కడకదా. గంజాయి మొక్కలు కలుపు మొక్కలు ఉన్నాయని, వాటిని నిర్మూలించాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

# ఐబొమ్మ రవి కేసులో సంచలనాలు

## ఐబొమ్మ, బప్పం సైట్లు బ్లాక్.. బెట్టింగ్ యాప్ వల్లే చిక్కిన రవి

**హైదరాబాద్, మహా :** ఐ బొమ్మ ఇమ్మడి రవి కేసులో పలు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని వేల సినిమాలను హార్డ్ డిస్క్‌లో రవి భద్రపరిచినట్లు పోలీసులు గుర్తించారు. డిలీట్ అయినా సరే బ్యాకప్ లో వేల సినిమాలను హార్ట్ డిస్కుల్లో అతడు ఉంచినట్లు పోలీసులు కనుగొన్నారు. ఇమ్మడి రవి స్వస్థలం విశాఖపట్నం కాగా.. అతడు ముంబైలో ఎంబీఏ పూర్తి చేసినట్లు విచారణలో వెల్లడైంది. ముస్లిం యువతిని రవి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత కొన్ని రోజులకు భార్యతో విడిపోయాడు. 2018 నుంచి హైదరాబాద్ కూకట్ పల్లిలోని రెయిన్ బో విస్టాలో రవి నివాసం ఉంటున్నాడు. తొలుత ప్యామిలీతో ఉన్న అతడు.. ఆ తర్వాత ఒంటరిగా నివసిస్తున్నాడు. అయితే కమ్యూనిటీ వాసులు అడిగితే.. తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నట్లు చెప్పేవాడని తెలుస్తోంది. ఓ బెట్టింగ్ యాప్, ఈఆర్ ఇన్ఫోటెక్‌లకు అతడు




సీఈవోగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు రెయిన్‌బో విస్టా నుంచి ఇతర దేశాలకు ఐపీ అడ్రస్‌ను రవి మార్చుకుంటూ వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. బ్రిటన్‌లో ఏకంగా ఒక టీంను రవి నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని వేల సినిమాలను తన టీంతో కలిసి సర్వర్ల ద్వారా రవి హ్యాక్ చేస్తున్నట్లు పోలీసులు కనుగొన్నారు. గ్లోబల్ వ్యాప్తంగా పెద్ద నెట్ వర్క్‌ను ఇమ్మడి రవి నడిపిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఐబొమ్మ



ఓనర్ ఇమ్మడి రవి అరెస్ట్ చేసిన పోలీసులు ఐబొమ్మ, బప్పం సైట్లు బ్లాక్ చేయించారు. నెదర్లాండ్స్ నుంచి ఓటీటీ సర్వర్లను హ్యాక్ చేసి పైరసీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. బెట్టింగ్ యాప్ వల్లే రవి చిక్కినట్లు తెలుస్తోంది.

**ఐబొమ్మ రవికి నెటిజన్ల మద్దతు**

ఇదిలా ఉండగా.. ఐబొమ్మ రవికి సోషల్ మీడియాలో రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో 'ఐబొమ్మ' ట్రెండింగ్‌లో ఉంది. ఇమ్మడి రవిపేదలు, మధ్య తరగతి వాళ్ల కోసమే పైరసీ చేశాడంటూ పోస్టులు పెడుతున్నారు. థియేటర్ రేట్లు భారీగా పెంచడం వల్లే ఐబొమ్మకు అలవాటు పడ్డామంటూ ట్వీట్లు చేస్తున్నారు. సామాన్యులకు అందనంత రేట్లు పెంచి సినిమా థియేటర్లకు రానివ్వని పరిస్థితి తీసుకువచ్చారని సామాన్యులు ఆరోపిస్తున్నారు.

## పత్తి రైతులను కేంద్ర ప్రభుత్వం దోపిడీ చేస్తుంది

**ఎండి జహంగీర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు**



**వలిగొండ, మహా :** కిసాన్ కపాస్ పేరుతో పత్తి రైతులను కేంద్ర ప్రభుత్వం దోపిడీ చేస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి జహంగీర్ అన్నారు ఆదివారం వలిగొండ మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో గ్రామీణ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన జహంగీర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతి పై సుంఖాన్ని 11 శాతానికి తగ్గించి దేశ పత్తి రైతులను తీవ్రంగా నష్టపరిచేందుకు కిసాన్ కపాస్ పేరుతో సిసిఐ కొనుగోలు కేంద్రం ద్వారా ఎకరానికి కేవలం 7 క్వింటాళ్లు పత్తిని కొనుగోలు చేయాలని నిబంధన విధించడం వల్ల దేశంలో 50 లక్షల మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రైతులను దళారీలకు పత్తిని అమ్మాలంటూ ప్రోత్సహించడం లాంటిదని దీంతో ప్రభుత్వం మరియు రైతులు లబా పడకుండా దళారులకు లాభాలను చేకూర్చే విధంగా ఉందన్నారు ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మద్దెల రాజయ్య గణపతి రెడ్డి కొమ్మిడి లక్ష్మా రెడ్డి వాకిటి వెంకటరెడ్డి మారబోయిన నరసింహా కవిడే సురేష్ వేముల నాగరాజు దొడ్డి బిక్షపతి యాదయ్య చంద్రయ్య సత్తిరెడ్డి ఆనందం అమరేందర్ ముత్తయ్య రాములు రఘునాథరెడ్డి శ్రీకాంత్ వేముల జ్యోతి బాబు విష్ణు తదితరులు పాల్గొన్నారు

## 42% రిజర్వేషన్లు అమలు చేయడానికి కేంద్రం చట్టం చేయాలి

**రన్ ఫర్ సోషల్ జస్టిస్ మార్నింగ్ వాక్ లో సాయిని యాదగిరి**



**వలిగొండ, మహా :** బీసీలకు రావలసిన 42% రిజర్వేషన్లు అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలని బీసీ సంఘం మండల అధ్యక్షులు సాయిని యాదగిరి అన్నారు ఆదివారం రన్ పర్ సోషల్ జస్టిస్ మార్నింగ్ వాకర్స్ తో కలిసి ఆయన మాట్లాడుతూ అన్నారు ఆదివారం ఉదయం వలిగొండ మండల కేంద్రంలో న్యూ బస్టాండ్ నుండి హైస్కూల్ వరకు నిర్వహించిన మార్నింగ్ వాక్ లో ఆయన మాట్లాడారు ఈ కార్యక్రమంలో బిసి సంఘం పట్టణ అధ్యక్షులు నానచర్ల రమేష్ నాయకులు పబ్బుసురేందర్ కాసుల వెంకన్న పబ్బు వెంకటరమణ బత్తిని బిక్షపతి పబ్బు శివ మారగోని బాలయ్య కౌడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు





# మంత్రులను కలిసిన నవీన్ యాదవ్

### తన గెలుపులో కీలక పాత్ర పోషించారంటూ కృతజ్ఞతలు

### అసదుద్దీన్ ఓవైసీని కలిసిన థ్యాంక్స్ చెప్పిన నూతన ఎమ్మెల్యే

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా.. నవీన్ యాదవ్ వరుసగా రాష్ట్ర మంత్రులను కలుస్తున్నారు. మంత్రులతో సమావేశమై వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు, రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ విజయం సాధించినందుకు వారు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పెద్దల మార్గదర్శకత్వంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని అన్నారు.

**అసదుద్దీన్ ఓవైసీని కలిసిన నవీన్ యాదవ్..**

అనంతరం ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపఎన్నికలో ఎంఐఎం పార్టీ నవీన్ యాదవ్‌కి పూర్తి స్థాయి మద్దతు ప్రకటించినందుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ విజయంలో పార్టీ పోషించిన కీలక పాత్రను నవీన్ యాదవ్ గుర్తు చేసుకున్నారు. అసదుద్దీన్ ఓవైసీకి పుష్పగుచ్ఛం అందించి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జూబ్లీహిల్స్ ప్రజలకు, మైనార్టీల సంక్షేమానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని ఈ సందర్భంగా నవీన్ యాదవ్ అన్నారు.

## ఎమ్మెల్సీ నవీనే కాదు.. హరీశ్, గంగుల కమలాకర్ కూడా వివరణ ఇవ్వాలి

**జూబ్లీహిల్స్ ఎన్నికల్లో నాది ప్రేక్షకపాత్రే.. జాగృతి అధినేత కల్వకుంట్ల కవిత**

**మహా నెట్ వర్క్:** జాగృతి జనం బాట కార్యక్రమంలో ప్రజలు చెప్పిన వాటి ఆధారంగానే తాను ఆరోపణలు చేసినట్లు కల్వకుంట్ల కవిత చెప్పారు. తాను ఏసీ రూమ్‌లో కూర్చొని మాట్లాడడం లేదని.. తన ఆరోపణలకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ వివరణ ఇచ్చినందుకు సంతోషమని అన్నారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, గంగుల కమలాకర్ సైతం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిగతా వాళ్లూ ఈ ఒరవడిని కొనసాగించాలని ఆకాంక్షించారు. నక్కలగండి ప్రాజెక్టు వ్యవహారంపై జాగృతి చేసిన డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గిందని చెప్పుకొచ్చారు. తనపై బీఆర్ఎస్ వాళ్లు చేసే కామెంట్లకు జాగృతి కార్యకర్తలు కౌంటర్ చేస్తారని హెచ్చరించారు. బాధ్యతగల ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తే వివరణ ఇవ్వాలే తప్ప ఎదురుదాడికి దిగడం ఏంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో అంతర్గతంగా జరుగుతున్న పరిణామాలను సీఎం రేవంత్ రెడ్డి అనుకూలంగా వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. అసలు రేవంత్ రెడ్డికి మాట్లాడే అవకాశం ఇచ్చిందే బీఆర్ఎస్ వాళ్లని ఆగ్రహించారు. ఏ పార్టీ కూడా ఆడవాళ్లకు న్యాయం చేయడం లేదని.. కాంగ్రెస్ పార్టీలో పదవుల కోసం మహిళలే ధర్నాలు చేశారని కవిత ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీని పక్కనపెట్టి ప్రియాంక గాంధీకి న్యాయం చేయమని ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడగలరా? అని నిలదీశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో తన పాత్ర ఏమీ లేదని.. తాను ప్రేక్షకపాత్ర మాత్రమే వహించానన్నారు.

# రిజర్వేషన్ ఇవ్వకుండా ఎన్నికలకు వెళ్తే అగ్నిగుండమే..

### బీసీ పోరాటం ఇక్కడ నుండే మొదలవుతుంది.. మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

**ఖమ్మం, మహా:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వకుండా స్థానిక ఎన్నికలకు వెళ్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతోందని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు సంబంధించి ఇప్పటి వరకు ప్రధాన మంత్రిని కానీ.. రాష్ట్రపతిని కానీ, కేంద్రమంత్రిని కానీ ఒక కాంగ్రెస్ ఎంపీ కూడా కలవలేదన్నారు. అలాంటి వేళ.. ఈ బిల్లు ఎలా పాస్ అవుతుందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. 42 శాతం రిజర్వేషన్ సాధించడమే రెండు ప్రధాన పార్టీల బాధ్యత అని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు చూసి బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందంటే అది పిచ్చితనమే అవుతుందని స్పష్టం చేశారు. తాము ఉప ఎన్నికల్లో రెండు మినహా అన్ని గెలిచామని గుర్తు చేశారు. ఉప ఎన్నికలలో అధికారంలో ఉన్నవారికే గెలుపు అవకాశాలు అధికమని పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వి. శ్రీనివాస్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. మీరు ఎన్ని అబద్ధాలు ఆడిన భరించామని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రజల నుండి తిరుగు బాటు తప్పదు..**

బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాలని అసెంబ్లీలో కేసీఆర్ ఈ బిల్‌ను ఏకగ్రీవం చేశారని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఈ బీసీ రిజర్వేషన్‌ను పక్కన పెట్టి ఎన్నికలకు వెళ్లాలని చూస్తే బీఆర్ఎస్ పార్టీ ఊరుకోదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏదో ఒక రోజు ప్రజల నుండి తిరుగు బాటు తప్పదని.. బీసీ పోరాటం ఇక్కడ



నుండే మొదలవుతుందని తెలిపారు. మూడేళ్ల క్రితం ఖమ్మంలో ఎక్సైజ్ స్టేషన్, ఈతవనం ప్రారంభించామన్నారు. ప్రస్తుతం ఈతవనం, గౌడ భవనం చూశామని చెప్పారు. స్థానికంగా ఒకరిని అడిగితే రేవంత్ ప్రభుత్వం కొలువు తీరి.. రెండేళ్లు అయ్యిందని.. ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదన్నారన్నారు. ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదని చెప్పారని తెలిపారు. ఏ జిల్లాకు లేని ప్రాధాన్యం ఖమ్మం జిల్లాకు మాత్రమే ఉందన్నారు. ఈ జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నారని చెప్పారు. వీరి వద్ద ప్రధాన శాఖలు ఉన్నాయని తెలిపారు. 10 ఏళ్లలో ఆంధ్ర ప్రజలు మన రాష్ట్రంలో ఉంటే బాగుండు అనే విధంగా తెలంగాణ అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తర్వాత, ఆ ఒక్క ఎన్నికను చూసి గ్రామ పంచాయతీ ఎన్నికలు పెట్టాలని కాంగ్రెస్ నాయకులు చూస్తున్నారంటూ మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు.

## సుంకి శాలలో శ్రీవెంకటేశ్వర స్వామి కళ్యాణం



**వలిగొండ, మహా :** వలిగొండ మండల పరిధిలోని సుంకిశాల గ్రామంలో డాక్టర్ పైళ్ళ మల్లారెడ్డి సాధన యు.ఎస్.ఎ వారి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం నేడు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు సేకరించాలని ఆలయ కమిటీ ఆలయ అర్చకులు తెలిపారు.

## సంగెం గ్రామంలో శ్రీ భీమ లింగేశ్వర దేవస్థానంలో శివ కళ్యాణం



**వలిగొండ, మహా:** వలిగొండ మండల పరిధిలోని సంగెం గ్రామంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివ కళ్యాణం నేడు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శివలింగం దగ్గరికి రోడ్డు మరమ్మతులు చేపట్టారు కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు సేకరించాలని ఆలయ కమిటీ ఆలయ అర్చకులు తెలిపారు.

## బిసీలకు 42 శాతం రిజర్వేషన్లకై రన్ ఫర్ సోషల్ జస్టిస్



**భువనగిరి, మహా:** రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపుమేరకు ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని విద్యా, ఉద్యోగ, రాజకీయ, రంగాల్లో మేమెంతో మాకు అంత వాటా కోసం రాజ్యాంగబద్ధమైన హక్కుల కోసం "రన్ ఫర్ సోషల్ జస్టిస్" కార్యక్రమాన్ని నిర్వహించారు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోవాలంటే, పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేసి, తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని, అదేవిధంగా డిసెంబరు ఒకటవ తేది నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభం అవుతున్నందున పార్లమెంటు సమావేశంలో బీసీ బిల్లు గురించి కాంగ్రెస్ పార్టీ నాయకులు చర్చించాలని 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేంతవరకు కాంగ్రెస్ పార్టీ అఖిలపక్షాలతో చర్చలు జరిపి, రిజర్వేషన్ అయ్యేంతవరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ నాయకులు అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్ చౌరస్తా నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు వాకర్లను కలుస్తూ, జూనియర్ కాలేజ్ గ్రౌండ్ లోని వాకర్లను కలిసి మాట్లాడి.. బీసీల రిజర్వేషన్ల అవసరం గురించి అందరితో మాట్లాడుతూ.. పాదయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొత్త నరసింహ స్వామి, కార్యనిర్వాహక అధ్యక్షులు గొట్టిపాముల బాబురావు, ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకులు మాటూరి అశోక్, నియోజకవర్గం అధ్యక్షులు సాబన్ కార్ వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ చైర్మన్ పోత్నక్ ప్రమోద్ కుమార్ ,మాజీ ఎంపీపీ అధికం లక్ష్మీనారాయణ గౌడ్, ,మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట నరసింహ, లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా భాస్కర్ నాయక్, శెట్టి బాలయ్య యాదవ్, ఇట్టబోయిన గోపాల్, పుట్ట వీరేష్ యాదవ్, కొత్త బాలరాజ్, ఓరుగంటి గోపాల్, ధర్పల్లి ప్రవీణ్ కుమార్, గుమడేల్లి రమేష్, పూర్ణచందర్, శివకుమార్, బాలరాజ్, గటికోప్పల శ్రీనివాస్, సత్యం, తదితర బీసీ నాయకులు, వివిధ పార్టీల బీసీ నాయకులు పాల్గొన్నారు.

# మా తడాఖా చూపిస్తాం

- బీసీ రిజర్వేషన్లు తగ్గిస్తామంటే చూస్తూ ఊరుకోం
- మాకు భిక్షం వద్దు.. రాజ్యాంగబద్ధంగా ఇవ్వండి
- పార్టీ పరంగా బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే యుద్ధం తప్పదు
- బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్. కృష్ణయ్య సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** పార్టీ పరంగా రిజర్వేషన్లు వద్దని, చట్టపరంగా రిజర్వేషన్లు ఇవ్వాలని తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్‌లో ఆదివారం జరిగిన 'బీసీ రిజర్వేషన్ల న్యాయ సాధన దీక్ష'కు బీసీ సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వం వహించారు. విద్యార్థి, యువజన, మహిళ, ఉద్యోగ, న్యాయవాదులు సహా 60కిపైగా సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మీడియాతో ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తే రాష్ట్రంలో యుద్ధం జరుగుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్లు తగ్గిస్తామంటే చూస్తూ ఊరుకోమని, మా తడాఖా చూపిస్తామని ఫైర్ అయ్యారు. పార్టీ పరంగా ఎన్నికలకు వెళ్లడం తప్పించుకునే ఉపాయమని, పార్టీ పరంగా ఇవ్వొద్దని గతంలో చెప్పినట్లు గుర్తు చేశారు. పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తే చాలా వివాదాలు వస్తాయని తెలిపారు. మాకు భిక్షం వద్దు.. రాజ్యాంగబద్ధంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ సమాజానికి న్యాయం చేయాలని, ప్రభుత్వము తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**42 శాతం కాదు, 52 శాతం రిజర్వేషన్లూ ఇవ్వొచ్చు..**

దీక్షకు అధ్యక్షత వహించిన బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రామాణిక పద్ధతులు పాటిస్తే 42 శాతం మాత్రమే కాదు, 52 శాతం రిజర్వేషన్లు కూడా అమలుచేయొచ్చని పేర్కొన్నారు. 'డేటా బలంగా ఉంటే చట్టపరమైన అవరోధాలు తగ్గుతాయి' అని వెల్లడించారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్ పెంపును అమలుచేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదే ఉందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రిజర్వేషన్లతోనే ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. దీక్ష సమయంలో ఇందిరా పార్క్ బీసీ రిజర్వేషన్ల నినాదాలతో మార్మోగింది. వేలాది మంది బీసీ సంఘాల కార్యకర్తలు తరలిరావటంతో ధర్నా ప్రాంగణం కిక్కిరిసింది. బీసీల జనాభా, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ప్రతిష్టాత్మక వేదికల్లో తగిన శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే డిమాండ్‌ను నేతలు పునరుద్ఘాటించారు.

## కుల, మతాల మధ్య బండి సంజయ్ చిచ్చు

**ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఫైర్**

**హైదరాబాద్, మహా:** కేంద్ర మంత్రి అయినప్పటికీ బండి సంజయ్ తన హోదాను మరచిపోయి మాట్లాడటం అలవాటుగా చేసుకున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. 'హిందువులంతా బీజేపీలో చేరాల్సిన పరిస్థితి వచ్చింది' అని ఆయన మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఆదివారం ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎంపీగా ఉన్న సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బీజేపీ డిపాజిట్ గల్లంతైందని, అసెంబ్లీ ఎన్నికల కంటే ఉపఎన్నికల్లో బీజేపీకి ఓట్లు తగ్గాయని ఎంపీ చామల ప్రశ్నించారు. "బీజేపీ లోపాయికారిగా బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇచ్చిందా?" అని ప్రశ్నించి, దీనిపై బండి సంజయ్ ప్రజలకు క్లారిటీ ఇవ్వాల్సిన బాధ్యత ఉందని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్ కేవలం ఒక కులం లేదా మతం ఓట్లతో గెలవలేదని, అన్ని వర్గాల ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో బీసీ బిడ్డకు టిక్కెట్ ఇవ్వడం వల్లే ప్రజలు ఆదరించారని అన్నారు. బండి సంజయ్ కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టడం మానేసి, రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం వద్ద కిషన్ రెడ్డి, బండి సంజయ్ కృషి చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అభివృద్ధి కోసం పదే పదే ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలుస్తున్నారని, కాబట్టి మోడీ, అమిత్ షాలపై ఒత్తిడి తెచ్చి హైదరాబాద్ మెట్రో విస్తరణ, ట్రిపులార్, మూసీ పునరుజ్జీవానికి నిధులు తేవాలని కేంద్ర మంత్రులను డిమాండ్ చేశారు.

## కుక్కల దాడిలో 18 గొర్రెలు మృతి సంఘటన భాదాకరం

**బాధిత కుటుంబానికి అండగా ఉంటాం...బీర్ల అయిలయ్య**

**యాదగిరిగుట్ట, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం చోల్లేరు గ్రామంలో 18 గొర్రెలు కుక్కల దాడి లో మృతి చెందిన సంఘటన స్థలానికి వెళ్లి తోటకూర వీరస్వామి వీరమ్మ బాధిత కుటుంబాన్ని ఆదివారం ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పరామర్శించారు. ఈ ఘటన జరగటం బాధాకరమని బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.. ఈ సందర్భంగా వారికి 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వారికి న్యాయం చేయాలని చెప్పారు.






## తెలుగు రాష్ట్రాల్లో కరాటే మాస్ గేమ్

**కరాటేకు ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుంది: టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్, మహా:** తెలుగు రాష్ట్రాల్లో కరాటే మాస్ గేమ్ అని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం గచ్చిబౌలి ఎన్ఎస్ఎన్ కరాటే లీగ్ 2025 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహేశ్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాస్టర్స్ రామస్వామి, కీర్తన్, నాని, శ్రీపాల్, హరీష్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కరాటే నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు ఉంటాయని స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటే స్టాండర్డ్స్ ఆటగాళ్లు రావాలని కోరారు. ఇలాంటి ఈవెంట్స్ ప్రతి ఏటా జరగాలని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



# కలగనాలి

- శిఖా - ఆకాష్,
93815 22247

ఇప్పుడెందుకో
కలలు కననీయడం లేదు.
కలలు కలవడం దేశద్రోహమౌతుంది !?
నీదైన శ్వాస మీద నిఘా.
నీదైనా మాట మీద నిఘా.
నీదైనా చేత మీద నిఘా.
మీ ప్రతి కదలక మీద నిఘా..నిఘా..
ప్రజాస్వామ్యమొక దగా
రాజ్యమొక కార్పొరేట్ పెత్తందారుల లాబీ.
మతోన్మాద నిర్బంధ రాజకీయాల ఊబి.
దేశభక్తి ఒక కుట్ర.
సనాతన మొక కుట్ర.
రాజ్యాంగం పై కుట్ర.
* * *
ఎవడైనా కలగనాలి.
కలగనడమంటే/నీ నుండి దూరం
చేయబడ్డ స్వేచ్ఛను పొందే కల.
ఊహకి భూమ్మీద కాళ్ళివ్వడం కల.
కలగనాలి! కలగనాలి!!
ఎవడైనా కలలు కనాలి.
కలగనడమంటే రేపును ఆహ్వానించడం.
కలగనడం ఒక కార్యాచరణ.
ఈ చీకటి కలగనకపోతే
ఈ సూర్యుడెట్టా వెలుగుతాడు?
ఈ సూర్యుడు కలగనక పోతే
రేపటి ఉదయమెట్టా ముందుకెళ్తుంది?
ఒక మార్పును కలగనాలి.
ఒక కొత్త మార్గమేదో నిర్మించేందుకు
కలగనాలి.
ఒక ప్రయాణమెప్పుడూ అవసరం.
నది ప్రవహిస్తున్నట్టు
నువ్వు కలగా కదిలితేనే
ఒక సమూహంగా నీలో కలల్ని
మోసుకుపోగలుగుతావు.
నీలో నీవు పోరాడటం ఒక కల కావాలి.
నీవు మరింతగా నీలోకి చూడటం ఒక కల.
నీ ఆలోచనలకు కోటానుకోట్ల కలలనిచ్చి
నీవు నిలబడేందుకు
ప్రాణమున్న మట్టిని సమకూర్చడం కల.
మౌనం మాటల యుద్ధమై విస్ఫోటించడం కల.
కలలు లేకపోతే నీవెలా కదలబారతావు?
చిటికెడు ఆశల రజను లేకుండా
ఎలా ఉత్తేజితుడవౌతావు?
చీమల బారులా ఎలా నిరంతరం
కొనసాగుతావు?
మట్టై నా, మొక్కైనా, మనిషైనా
మబ్బుల వానల్ని తెంచి చిగురులెత్తడం కల.
మబ్బులు మబ్బులు గా అనంత వర్షా న్ని
ఎలా మోసుకురాగలవు?
అమ్మ, నాన్న కన్న కల సృష్టి.
దారితప్పని నదిలా
వెనుతిరగని నదిలా పోవడానికి
ఒక కల కావాలి.
ఒక ప్రభాత సుందరంగా నిన్ను
సజీవం చేసే సంగీతమయమైన
ఒక కల ఎవరికైనా కావాలి.
కలలు కనని దేశమేదైనా ఉంటే
అది మృతపిండమే.
నిన్ను నీవు నిలబెట్టుకోవడానికి
కొట్టుకుపోయినా ఒడ్డుకు చేరడానికి
ఒక కల కావాలి.
నిన్ను నీవు బతికున్నావని
గుర్తు చేసుకోవడానికి
లాగి విడిచిన బాణం లాంటి
సృజన కొసకు నిప్పంటించే కల.
కల ఒకటి నిన్ను కంటూనే ఉండాలి.
ఎప్పటికైనా ఒక్క కలే
నిన్ను నిన్నుగా నిలబెడుతుంది.
నీదైన చైతన్యాన్ని
నీదైన జలపాత సౌందర్య ప్రవాహాన్ని
బతికిస్తుంది.
కలలు కనడమంటే
అవి సాకారమయ్యే ఆచరణగా
సామూహిక చేతన గా కొనసాగడం.
అనేకానేక సంకెళ్లను తెంచే
నీపై కొనసాగే దౌర్జన్యాలను, దుర్మార్గాలను
ప్రశ్నించే హక్కై
నిలిచే కలలు కనాలి.
సామ్రాజ్యవాదుల చీకటి శక్తులను
బదాబదలు చేసే సూర్య శిశువులా
కలగనాలి.
నీ కల ఆత్మ గౌరవ శిఖరమై
ధైర్యకవచమై నిలవాలి.
స్వేచ్ఛను కనాలి.
శత్రువు మరణాన్ని కలగనాలి.
ప్రజల హక్కుల్ని హరించే
రాజ్యాన్ని ఉరి తీసే కలకనాలి.
నువ్వే సామూహిక శక్తై
మనువాదుల పునాదులు కూల్చే/కల కనాలి.
న్యాయమైన కల
అన్యాయంపై ధిక్కారమైన కల
తల ఎత్తుకు తిరిగే
జెండాకున్నంత పొగరైన కల
ధర్మాగ్రహ ప్రతిఘటనైన కల.
కల ఒకటి కనాలి.
నిన్ను యుద్ధ వీరునిగా నిలబెట్టే కల
కనే తీరాలి.
కలగనాలి, కలగనాలి, కలగనాలి.
కలల సునామీ అయి
అసలైన దేశద్రోహులపై
రాజ్యాధికార పీఠాలపై
చిందులు తొక్కుతున్న
మతోన్మాదులపై విరుచుకుపడే
కల ఒకటి కనాలి.
మనిషిని మనిషిగా ప్రేమించే కల
మానవత్వమున్న
కల ఒకటి కనే తీరాలి.
కలలు కనండి కలలు.


## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# బతుకు బడిలో అక్షరాలు దిద్దిన అందెశ్రీ



తను పాట పాడితే సెలయేళ్లు మురిసాయి, గలగలా నవ్వాయి. కొమ్మారెమ్మలు, పల్లె పదాలతో చెట్టాపట్టాలేసుకుని ఆనంద పారవశ్యంతో ఊయలలూగాయి. ఉవ్వెత్తున ఎగసిన తెలంగాణ మలిదశ ఉద్యమం సమయంలో, ప్రజల పోరాట స్ఫూర్తిని, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ అందెశ్రీ రాసిన పాటలు లక్షలాది మంది హృదయాలను కదిలించాయి. ఆయన గీతాలు ఉద్యమానికి ఊపిరి పోశాయి.

తెలంగాణ రాష్ట్ర గీత స్రష్ట పామరుడి పదమే ఉద్యమ గీతికై నిలిచి, తెలంగాణ రాష్ట్రానికి అధికారిక గీతంగా నిలిచిన "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" గీతాన్ని అందించిన ప్రముఖ ప్రజా కవి, ప్రకృతి కవి డా. అందెశ్రీ. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అక్షర రూపం ఇచ్చిన మహోన్నత కవి, గేయ రచయిత ఆయన. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. 1961, జూలై 18వ తేదీన రేబర్తి గ్రామం, మద్దూరు మండలం (ఉమ్మడి వరంగల్ జిల్లా), ప్రస్తుతం సిద్ధిపేట జిల్లా పరిధిలో జన్మించారు.

**ప్రకృతియే విశ్వవిద్యాలయం:** చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయి, అనాథగా, పేదరికంలో పెరిగారు అందెశ్రీ. ఆయన బాల్యం పశువుల కాపరిగా, తాపీ మేస్త్రీగా, రోజువారీ కూలీగా గడిచింది. పాఠశాలకు వెళ్ళకపోయినా, ప్రకృతిని, లోకాన్ని విశ్వవిద్యాలయంగా భావించి, లోతైన తాత్త్విక భావాలను, అద్భుతమైన సాహిత్యాన్ని ఆశువుగా అందించారు. అందెశ్రీ గారిని అదే ఊరిలో జక్కిరెడ్డి రాధమ్మ చేరదీసి ఆదరించారు. ఒక ముఖాముఖిలో, జక్కిరెడ్డి మల్లారెడ్డి తన గురువు అని, ఆయన పని చేయించుకునేందుకు రామాయణ మహాభారత ఇతిహాసాల కథలు చెప్పి, తెలియకుండానే ఆ ఇతిహాసాలను తన మెదడులోకి పంపు చేశారని చెప్పుకున్నారు అందెశ్రీ.

మాక్లూర్ మండలం ఆమ్రాబాద్లో ఆశ్రమాన్ని నడిపిన శంకర్ మహరాజ్ గారు తనకు 'అందెశ్రీ'గా నామకరణం, ఉపనయనం చేసి, గాయత్రి మంత్రాన్ని ఉపదేశించారని, వేదాలు, ఉపనిషత్తుల సారాన్ని బోధించారని ఒక సందర్భంలో తెలిపారు. దాదాపు రెండు దశాబ్దాలపాటు బిరుదురాజు రామరాజు గారి వద్ద సాహిత్యంలో మెళకువలు తెలుసుకున్నానని, ఆయనను 'నాన్న' అని పిలిచేవాడిని అని కూడా చెప్పుకున్నారు.

"చదువుకుంటేనే భాష వస్తుందనుకుంటే పొరపాటు, అయితే సాంగత్యం లేకుంటే మాత్రం ఈ భాష రాదు" అని సగర్వంగా ప్రకటించుకున్న ప్రకృతి కవి అందెశ్రీ.

**ఉద్యమ గీతం చరిత్ర:** 2002 సెప్టెంబర్ 30వ తేదీన కామారెడ్డి పట్టణంలో జరిగిన ధూమ్ ధామ్ కార్యక్రమంలో "జయజయహే తెలంగాణ జననీ జయకేతనం" గీతం రాయడానికి బీజం పడింది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో ఈ గీతాన్ని తెలంగాణ ప్రజలు ఎంతగా స్వంతం చేసుకున్నారంటే, ఖమ్మం కోర్టులో న్యాయవాదులు 1556 రోజులపాటు ప్రతిరోజూ దీనిని ఆలపించిన తరువాతే విధులకు హాజరయ్యేవారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగీతంగా నిలిచి, 2024లో అధికారిక రాష్ట్ర గీతంగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ గీతం అందెశ్రీ గారి కీర్తిని చిరస్థాయిగా నిలబెట్టింది.

రాష్ట్ర గీతంలో ఏముంది?. ఈ గీతం సరళమైన పదజాలంతో, స్పష్టమైన భావ వ్యక్తీకరణతో, ప్రజల హృదయాలకు త్వరగా చేరువయ్యే విధంగా ఉంది. మట్టిపాటల మనిషి అయిన అందెశ్రీ జానపదాల పదునుని ఆయుధంగా ధరించి, ఒక ప్రాంతం యొక్క సమస్త అస్తిత్వాన్ని, పోరాట చరిత్రను మరియు భవిష్యత్తు లక్ష్యాన్ని ఒకే తాటిపైకి తీసుకు రావడంలో పూర్తిగా విజయం సాధించారు. అందుకే ఈ గీతం తెలంగాణ ప్రజల హృదయాలలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకుంది.

పల్లవిలో తెలంగాణ తల్లికి జయకేతనం పలుకుతూ, గీతానికి గొప్ప ప్రారంభాన్నిస్తుంది. "ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం" అనే వాక్యం తెలంగాణ ఉద్యమంలో ప్రజల అపూర్వమైన ఐక్యతను మరియు పోరాట స్ఫూర్తిని స్పష్టంగా తెలియజేస్తుంది. ఇది రాష్ట్ర ఆవిర్భావాన్ని ప్రజల ప్రణామాలతో కూడిన శుభతరుణంగా అభివర్ణిస్తుంది.

చరణాలలో తెలంగాణ చరిత్ర, సంస్కృతి, త్యాగం మరియు భౌగోళిక గొప్పదనం అనే నాలుగు ప్రధానాంశాలను అద్భుతంగా మేళవించింది. కాకతీయ కళా వైభవాన్ని రామప్ప దేవాలయ క్రాంతిరేఖతో, గోలుకొండ నవాబుల గొప్పదనానికి ప్రతీకగా చార్మినార్ను, తెలంగాణ పండుగ సంస్కృతిలో భాగమైన బతుకమ్మను జానపదుల జేజేలుగా, గౌతముడు నడియాడిన గుట్టలను ఆలయాలుగా వర్ణించడం ద్వారా తెలంగాణలోని ధార్మిక వారసత్వాన్ని, శాంతిని, దార్శనికుల విజ్ఞానపు దీప కాంతిని కొలువైన స్థలంగా అభివర్ణించడం ద్వారా తెలంగాణ మేధో సంపదకు గౌరవం ఇస్తుంది. జానపద జనజీవనం, కవిగాయకుల కళలు ఈ నేల యొక్క ప్రాణం అని చెబుతున్న ఈ గీతాలు జాతిని జాగృత పరచే శక్తిమంతమైన జనజాతరగా నిలిచాయని చాటిచెబుతుంది.

"వేలకొలదిగా వీరులు నేలకొరిగి పోతేనేమి / తరగనిదీ నీ త్యాగం" అంటూ ఉద్యమంలో జరిగిన అపూర్వమైన త్యాగాన్ని మరియు శ్రమయాగాన్ని మరువలేనిదిగా పేర్కొంటుంది. గోదావరి, కృష్ణమ్మలు పచ్చదనాన్ని, పసిడి సిరులను పండిస్తున్న భౌగోళిక గొప్పదనాన్ని ,చివరి చరణంలో తెలంగాణ యొక్క భవిష్యత్తుపై ఉన్న ఆకాంక్షను తెలియజేస్తుంది. తెలంగాణ సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండి, భారతావనిలోనే భాగ్యసీమ కావాలని ఆశిస్తూ, ఆ దిశగా ముక్కోటి ప్రజలు కైవారం చేయాలని పిలుపునిస్తుంది.

రాష్ట్రీయ గీతాన్ని రాసి పేరు ప్రఖ్యాతులు గడించిన ఈ మట్టిపాటల మనిషి, జానపదాలతో జనాలను కదిలించిన కవి, తానుగా ఏ పాఠశాల మెట్లెక్కి ఏ చదువూ చదవకపోయినా, తన అపారమైన ప్రతిభతో, సామాజిక స్పృహతో తెలుగు సాహితీ జగత్తులోనూ, తెలంగాణ చరిత్రలోనూ చిరస్మరణీయమైన స్థానాన్ని సంపాదించుకున్నారు.

*** ***

'మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు' గీతం ఆధునిక సమాజపు ఆత్మఘోష. తెలంగాణ ఉద్యమ గీతమే కాకుండా, ఆయన రాసిన 'మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు' అనే పాట మానవీయ విలువలపై గొప్ప తాత్త్విక చింతనను ప్రతిబింబిస్తూ, అపారమైన ప్రజాదరణ పొందింది. లోకకవి అందెశ్రీ కలం నుండి వెలువడిన గీతాలలో అత్యంత ప్రసిద్ధమైనది ఈ గీతం. ఈ పాటను 'ఎర్ర సముద్రం' సినిమాలో ఉపయోగించారు. అంతేకాదు, డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా కూడా మారింది. ఈ పాట నేలతల్లి గుండె లోతుల్లోంచి వినబడుతున్న ఆర్ద్రమైన ఆత్మఘోష. పచ్చి నిజాల పట్ల కవి చేసిన తిరుగుబాటు ప్రకటన. ఈ పాట బహుళ ప్రజాదరణ పొంది, ఆయనను కవిగా ఉన్నత స్థానంలో నిలిపింది. ఇది కేవలం ఒక పాట కాదు, ఆధునిక మానవ సమాజపు ఆత్మఘోష.

**మానవీయ విలువలపై ప్రశ్న:** మానవత్వం, స్వార్థం, మతం, అవినీతి వంటి ఎన్నో సామాజిక అంశాలను ప్రశ్నిస్తూ ఈ గీతం సాగుతుంది. "మచ్చుకైనా లేదు చూడు మానవత్వం ఉన్నవాడు" అన్న కవి వేదన, మనిషితో నిండిన ఈ లోకంలోనే అసలైన 'మనిషన్నవాడు' జాడ దొరకని అన్వేషణగా మారింది. మనిషి తన నీడలా వెంటాడుతున్న "నిలువెత్తు స్వార్థము" వలలో చిక్కుకుని, ఆత్మీయ అనుబంధాల విలువను మంటగలుపుతున్న తీరును కవి తీవ్రంగా ప్రశ్నించారు. జ్ఞానం, వివేకం ఉన్న మనిషి, అవినీతి, అత్యాశ అనే పెను ఆశకు బానిసై "శిథిలమైతున్నాడు" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

**ధనార్జన దురాశ:** మనిషిని అత్యంత హీన స్థితికి దిగజార్చిన కారణాన్ని కవి "రూపాయి" అనే ముద్రలో చూశారు. "రూపాయి కొరకు ఏ రూప పాపాన్నైతేనేమి / ఒడిగట్టె అదుగో చూడమ్మా" అంటూ ధనార్జనే ఏకైక లక్ష్యంగా మారిన మనిషి దురాశను దుయ్యబట్టారు.

**మత, కుల వైరుధ్యం:** కవి ఈ పాటలో మతాన్ని, భక్తిని కేవలం వ్యాపారంగా మార్చిన మనిషి లౌక్యాన్ని నిలదీశారు. "ఇరవైఐదు పైసల గరొత్తు గాల్చి / అరవైఐదు కోట్ల వరములడుగుతాడు" అంటూ భక్తుడి బేరసారాల మనస్తత్వాన్ని ఎండగట్టారు. చీమలకు చక్కెర, పాములకు పాలు పోసి జీవకారుణ్యం గురించి మాట్లాడే మనిషి, "తోడ పుట్టినవాని ఊరవతలికి నెట్టి / కులమంటు ఇలమీద కలహాల గిరుగీసి" తోటి మనిషిని దూరం పెడుతున్న వైరుధ్యాన్ని నిశితంగా చూపారు. కుల, మత ఘర్షణల మధ్య మానవత్వం కనుమరుగై పోతుండడాన్ని చూసి కవి గుండె తల్లడిల్లింది. "అంధుడై పోతున్నడమ్మా హిందూ ముస్లిం / క్రీస్తు సిక్కు పార్సీ అంటూ తనను తా మరిచేనోయమ్మా" అంటూ, మత కంచెలు వేసుకుంటున్న మనిషి అవివేకంపై ధ్వజమెత్తారు.

**స్త్రీలపై దౌర్జన్యం & కుటుంబ బంధాలు:** స్త్రీలపై జరిగే అమానుష అకృత్యాలపై కవి గుండెలవిసేలా కన్నీరు కార్చారు. "కండ్ల పొరలు గమ్మి కామముతో ఊరేగి / అంగడి సరుకులా ఆడవాళ్ళని చూచి" అంటూ లైంగిక దౌర్జన్యాల్ని తీవ్రంగా ప్రతిఘటించారు. అలాగే, "కన్న తండ్రిని తల్లిని కాలికి చెప్పుగ / నిరాదరించిన సంతానాన్ని చూచి" అని దుఃఖిస్తూ, ముసలి తల్లిదండ్రులను దిక్కులేనివారిగా మార్చిన నేటి సమాజపు పతనపు వాస్తవాన్ని ఆవిష్కరించారు.

**ప్రబోధం:** ఈ గీతం కేవలం విమర్శ మాత్రమే కాదు, అంతిమంగా ఒక ప్రబోధం. కోట్లాది హృదయాలను కదిలించి, మనిషిలోని మంచితనాన్ని తట్టి లేపే ప్రయత్నం చేసింది. "ఆకాశమే హద్దుగా ఆశలు సాధించగల మేధస్సున్న మనిషి" అహంకారపు వలలో చిక్కుకుని "నిష్క్రియా పరుడిగా మారిపోతున్నాడు" అన్న కవి చివరి హెచ్చరిక, మనిషి..తనలోని మానవత్వాన్ని పునఃప్రతిష్ఠించుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కి చెబుతుంది.

'మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు' అనే ఈ గీతం ప్రతి మనిషికి ఒక ఆత్మవిమర్శనా దర్పణం. మనిషితనం కోసం తపించిన ఒక ప్రజాకవి ఆవేదనకు శాశ్వత చిరునామా. సమకాలీన సమాజానికి దర్పణం పట్టి సజీవ శిల్పమై సాక్షాత్కరించింది ఈ గీతం.




- -విల్సన్ రావు కొమ్మవరపు,
89854 35515

# నిలువెత్తు సంఘర్షణలకు నిలువుటద్దం

మానవనాగరికత కొత్తపుంతలు తొక్కుతున్నా, ప్రపంచీకరణ నేపథ్యంలో ఎన్నెన్ని అడ్డంకులు ఎదురవుతున్నా దశాబ్దాలుగా తమ సంస్కృతిని కాపాడుకుంటూ నేటికీ తమ కులవృత్తుల ద్వారా మనుగడ సాగిస్తూనేవున్నారు ఎందరో కులవృత్తిదారులు. తరతరాల తమ సంప్రదాయాల్ని వీడలేక దుర్భర దారిద్ర్యంలోనూ వాళ్లు తమ వృత్తులతో భారంగా బ్రతుకుల్ని వెళ్లదీస్తూనేవున్నారు. వృత్తులు మూలపడిపోతూ పనిముట్లు అటకెక్కుతుంటే బ్రతుకుతెరువు కోసం కొందరు సుదూరప్రాంతాలకు వలసలు వెళ్లిపోతున్నా మరికొందరు మాత్రం ఆ వృత్తులు ముందుక సాగలేక అవి కల్పించే సామాజిక సంఘర్షణలో సతమతమైపోతూ అగ్రకులాల ఆధిపత్యంతో బాటు తమవారి ఆధిపత్యానికీ గురైపోతున్నారు. అలాంటి నిలువెత్తు సామాజిక సంఘర్షణకు ప్రత్యక్షసాక్షిగా వుండి, ఆ సంఘర్షణ తాలూకు ఏకుదారాల అల్లికలో మేకుల్లాంటి తన అనుభవాల నేపథ్యంలో, ఆ అనుభవాల్లోంచి పెల్లుబికిన భావోద్వేగాలతో డాక్టర్ బి. నాగశేషు వెలువరించిన నవల 'ఏకుదారం'. తెలుగులో దశాబ్దకాలంగా బహుజనసామాజిక సంవేదన ప్రధానంగా చేటుచేసుకున్న సాహిత్యంలో కులవృత్తులు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. కథ, కవిత్వం, నవల.. ఈ మూడు ప్రక్రియలూ కులవృత్తిదారుల జీవనధారల్ని ఆవిష్కరించాయి. దీర్ఘకవితలో పలు కులవృత్తుల పార్శ్వాలు చోటుచేసుకుంటే కథాప్రక్రియ ఆ వృత్తుల్లోని అనేక ఆటుపోట్లని వొడిసిపట్టుకుంది. నెరెళ్ల శ్రీనివాసగౌడ్ 'బతుకుతాడు'(కల్లుగీత), జి.ఎస్.చలం 'రేవు'(రజకవృత్తి) వంటి నవలలు కులవృత్తులకు సంబంధించిన పూర్తి స్వరూపాల్ని ఆవిష్కరించాయి. కురబల జీవన విధానాలతో బండి నారాయణస్వామి, డాక్టర్ వి. ఆర్. రాసాని, కాలువ మల్లయ్య వంటి ప్రసిద్ధ కథకుల కథలతో 'గొంగడి' కథాసంపుటి వెలువడింది. అప్పట్లో వెలువడిన బోయ జంగయ్య 'తోడేళ్లు' నవలలో నిజాం ప్రభువుల హయాంలో గొర్రెల కాపరులపై జరిగిన దొరల అకృత్యాలు కనిపిస్తే, ఇటీవల వెలువడిన సన్నపు వెంకట్రామిరెడ్డి 'కొండపొలం' నవలలో గొర్రెల కాపరుల అస్తిత్వ పోరాటం కనిపిస్తుంది. కురబలు తమ ప్రధానవృత్తిగా పరిగణించే కంబళ్ల నేతగాళ్లమీద తెలుగులో ఇదమిత్థంగా ఏ రచనా రాలేదు. ఇప్పుడు ఈ రచయిత ముందుమాటలో పేర్కొన్నట్టుగానే తెలుగులో కంబళ్ల నేతగాళ్ల నిలువెత్తు జీవనసంఘర్షణను ప్రతిబింబించిన నవల ఇదే మొదటిదని చెప్పవచ్చు.

అందుకే ఈ రచయిత తన జీవన పార్శ్వాలతో కలబోసుకున్న వృత్తిదారుల ఆ సంఘర్షణను వివరించడానికి తన అంతరంగమథనంతో కొన్నేళ్లపాటు శ్రమించాడు. తన బాల్యపు జ్ఞాపకాల్లోని సామాజిక సంవేదనను తొలిసారిగా నవలీకరించాడు. ఆ ప్రయత్నంలో చాలావరకు కృతకృత్యుడయ్యాడని చెప్పవచ్చు. 'నేను తప్ప ఈ కథాంశంతో ఈ నవలను ఇంకెవరూ రాయలేరు. ఆ జీవితం గడిపినటువంటివాడిని, ఆ జీవితంలోని ఒడిదుడుకులు అనుభవించినవాడిని. దగ్గరగా చూసినటువంటి వంటివాన్ని.




బాధితున్ని. అందుకే నేను రాయాలన్నాను' అని చెప్పుకున్నాడు.

ఈ నవలలో ఎక్కువభాగం అనంతపురం జిల్లాలోని మారుమూల గ్రామమైన మేసినపల్లిలో నాగరికతకు దూరంగా, దుర్భర దారిద్ర్యంలో మగ్గుతూ జీవనం సాగించే కంబళ్ల నేతగాళ్ల జీవనశైలి కనిపిస్తుంది. ఆ జీవన విధానంలోని ఎన్నో పార్శ్వాల్నీ, వివిధ ఘట్టాల్లోని వాతావరణపరిస్థితుల్నీ అర్థం చేసుకోవడానికి రచయిత శైలీ, స్థానికతకు తగినట్టుగా ఆ శైలిలో ప్రయోగించిన మాండలికపు నుడికారం దోహదపడుతాయి. కంబళ్ల నేతగాళ్ల కుంటుంబంలోని ఒక యువకుడి ఎగుడుదిగుడుల జీవనప్రస్థానం, అతడి ముప్పై ఏళ్ల వివిధ దశల్లోని జీవనసంఘర్షణ ఈ నవలలో కనిపిస్తాయి. కొలిమిలో కాలే ఇనుపదిమ్మెలా జీవనకాష్టంలో కాలుతూ అతడు ఏవిధంగా ఒక విద్యావంతుడిగా మారాడన్నదే ఈ నవల లోని ప్రధాన కథాంశం. అనుభవాల్లోంచి వెలువడే భావోద్వేగాలు హృదయాల్ని ఆర్ద్రతలో తడిచేస్తాయి. ఈ నవలలోని రచయిత అనుభవాలు అలాంటివే. ఈ నవలలోని కథానాయకుడు బీరప్ప గురించి రచయిత వర్ణించిన 'బీరప్పది ఆకలి పుట్టుక, ఆకలి పెంపకం, అన్నం తినని బతుకు తనది. అన్నం కోసం ఎన్నో రాత్రులు, పగళ్లు ఏడ్చాడో తనకు తెలియదు. అన్నం మెతుకుల వెతుకులాటకే సరిపోయింది. ఆకలి గేయానికి పల్లవి, చరణం అతడే. వసంతం కోల్పోయిన పూలతోట బీరప్ప' అనే వాక్యాలు చాలు అతడి జీవన సంఘర్షణను తెలియజేయడానికి. ఆ ఆకలి ఎంతంటే కేవలం మధ్యాహ్నం భోజనం కోసమే అతడు స్కూలుకు వెళ్లే పరిస్థితులు దాపురించినంత. ఒక అట్టడుగు వర్గం కులవృత్తి పట్ల పెంచుకున్న మమకారం, ఆ వర్గంలోని దుర్భర దారిద్ర్యం, అగ్రకుల ఆధిపత్యంతో ఆ వర్గంలో కనిపించే నిస్సహాయత, పురుషుల వ్యసనాలతో అతలాకుతలమయ్యే స్త్రీల జీవితాలు, తమ స్వార్థంతో వ్యసనాలను పెంచి పోషించే సారావ్యాపారుల స్వైరవిహారం, అసలు చదువు జోలికే వెళ్లకుండా ఆ చదువు తమకు అబ్బదని సరిపెట్టుకొని సాధారణ జనజీవనప్రవంతిలోకి రావడానికి ఆసక్తి చూపని గొర్రెల కాపరుల అమాయకత్వం, వారిలో అరకొర చిగురించే చైతన్యాన్ని కూడా అడ్డుకునే సామాజిక దుష్టశక్తులు.. ఇవన్నీ మన కళ్లముందు కనిపిస్తాయి. గొర్రెల కాపరుల జీవనవిధానం, వాళ్లు కంబళ్లు నేసే విధానానికి సంబంధించిన సమగ్ర చిత్రణ ఒక డాక్యుమెంటరీ చిత్రంలా కనిపిస్తుంది.

మేసినపల్లిలో కంబళ్లు నేసే ముత్యాలమ్మ, సంజన్న కుటుంబమే ఈ నవలకు కేంద్రబిందువు. వారి ముగ్గురు కొడుకుల్లో చిన్నవాడు బీరప్ప. సంజన్న తాగుడుకు బానిసై తాము నేసే కంబళ్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని తాగుడుకే కేటాయిస్తూ కుటుంబానికి పస్తులు మిగులుస్తుంటాడు. తాగిన మైకంలో భార్యను చిత్రహింసలకు గురిచేస్తుంటాడు. వారి ఆకలిని పూర్తిగా తీర్చలేని కులవృత్తి వారిచేత భిక్షాటన కూడా చేయిస్తుంటుంది. డొక్కాడని స్థితిలో ఆ కుటుంబం పుట్టపర్తి సమీపంలోని జానకంపల్లికి వలసవెళ్లిపోయి కూలిపనులు కూడా చేస్తుంటుంది. బీరప్ప సోదరులు పెద్దోడు, నడిపోడులకు చదువు అబ్బకపోవడంతో పెద్దోడు తండ్రి తాగుడు అలవాటును తానూ వంతబట్టించుకుంటాడు. నడిపోడు సేద్యం చేసుకుంటుంటాడు. బీరప్పమాత్రం బడికి వెళ్లి చదువుకుంటాడు. అయితే పదవతరగతి పాసయ్యాక హిందూపురంలోని హాస్టల్ లో వున్నప్పుడు అక్కడి సావాసగాళ్ల ప్రభావంతో దుర్వ్యసనాలకు లోనవుతాడు. అక్కడి హెడ్ మాస్టర్ అతనిని మందలించడంతో చదువును వదిలేసి ఒక లారీ డ్రైవర్ వద్ద సహాయకుడిగా చేరుతాడు. అయితే పనిభారం వల్ల అక్కడినుంచి వచ్చేసినప్పుడు ఒక బంధువు ప్రోద్బలంతో తిరిగి హాస్టల్ కు వెళ్లి పదవ తరగతి వరకు చదువుకుంటాడు. పందులు మేపుకునే కొదమోడు కొన్ని కారణాల వల్ల రాజకీయనేత కనుసన్నల్లో ఏర్పాటైన నక్సలైట్ దళంలో చేరిపోతాడు. ఆ కొదమోడి పరిచయంతో బీరప్ప తానూ ఆ దళంలో చేరిపోతాడు. అయితే అనూహ్య పరిస్థితుల్లో తుపాకీ మిస్ ఫైరింగ్ తో కొదమోడు చనిపోవడంతో బీరప్పలో మార్పు వచ్చి అతడు మళ్లీ చదువును కొనసాగించి ప్రాణమిత్రుడు మంజునాథ్(ఇప్పుడు రియల్ ఎస్టేట్ లో స్థిరపడ్డ అతడే ఈ నవలను వెలుగులోకి తెచ్చాడు) సాయంతో ఇంటర్ పూర్తి చేస్తాడు. అనంతరం బెంగుళూరు వర్శిటీలో పీజీ పూర్తి చేసుకొని గోల్డ్ మెడల్ సాధిస్తాడు. తనతోటి పరిశోధక విద్యార్థిని సాయంతో నెట్ పరీక్షలో ఉత్తీర్ణుడై ఆ విద్యార్థినినే వివాహం చేసుకుంటాడు. చెన్నై వర్శిటీలో అధ్యాపకుడిగా ఉద్యోగం సాధించి తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాడు.

సాధారణంగా గ్రామాల్లో అట్టడుగువారిపట్ల అగ్రకులాల వాళ్లు ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తే ఈ నవలలో ఆ వర్గంలోనే పెద్దమనుషులుగా చెలామణి అయ్యే వాళ్లూ తమ ఆధిపత్య ధోరణిని ప్రదర్శించి వారిని దోపిడీ చేయడాన్నీ, ఒక వర్గంలోనే సంఘీభావం లేకపోవడాన్నీ గమనించవచ్చు. ఆ ఆధిపత్య ధోరణికి అట్టడుగు వర్గాలవారు ఎంతగా దగా పడతారో చెప్పడానికి ఈ నవలలోని పక్కీరమ్మ పాత్రను ప్రబల ఉదాహరణగా పేర్కొనవచ్చు. పక్కీరమ్మ భర్త సీమప్ప తాను పూటగడవక చేసిన అప్పులు తీర్చలేక ఆ వూరికి దూరమైపోవడంతో ఆ వూరిలోని సారావ్యాపారి అక్కులప్ప, అతని సోదరుడు, కంబళినేతకు అవసరమయ్యే చింతపండు సరఫరా చేసే చింతపండు వ్యాపారి సోమణ్ణ, అతని కొడుకు, ఆ కొడుకు అనుచరుల కన్ను పక్కీరమ్మపై పడుతుంది. వారి దాష్టీకానికి పక్కీరమ్మ పలుసార్లు బలి అయిపోతుంటుంది. వారి కనుసన్నల్లోని ఫకీరమ్మ దుర్భరస్థితిని రచయిత ఇలా వర్ణిస్తాడు... 'ఏదో సమారాధనగా చుట్టాల్ని పిలుచుకుపోయినట్టు సోమణ్ణ కొడుకు తన క్లాస్మేట్స్, అన్నదమ్ములందరినీ కూడా తోలుకుపోతున్నాడు ఆయమ్మ తాకి. గొరిల్లా దాడిలా.. విస్తర్లో విసిరిన అన్నానికి కాకులు వాలినట్టు, మాంసం మొత్తం తినేసి పడేసిన ఎముకకు కుక్కలు మూగినట్టు ఎప్పుడంటే అప్పుడు మూగి దాడిచేస్తున్నారు'.... మరో సందర్భంలో నేతగాళ్లకు సాయాలు మంజూరు చేసే నిమిత్తం ఏర్పాటయ్యే సొసైటీల్లో తన మనుషుల్నే సభ్యులుగా చేర్పించి అక్రమాలకు పాల్పడే అక్కులప్ప అనినీతిని బీరప్పఅడ్డుకున్నాడన్న అక్కసుతో అక్కులప్ప తన అనుచరులతో బీరప్ప ఇంటిమీద దాడిచేయిస్తాడు. అట్టడుగు వర్గాల్లో భర్తల వ్యసనాలను మహిళలు ఎంత సహనంతో భరిస్తారో చెప్పడానికి ముత్యాలమ్మ పాత్ర ఒక ప్రబల ఉదాహరణ. భర్త హింసిస్తున్నప్పుడు ఆమె స్థితిని రచయిత ఒకచోట ఇలా వర్ణిస్తాడు... 'మళ్లీ ముత్యాలమ్మ పేగులు అరిచిన శబ్దం పిల్లలకు వినిపించింది. ఈసారి ముగ్గురూ తలలూపి ఒక్కసారి తల్లివైపు చూశారు మౌనంగా. ఆమె కూడా నిశ్శబ్దంగా వుంది. అక్కడ నిశ్శబ్దానికి మించింది లేదు రాదు. ఎంత నిశ్శబ్దమంటే ఎత్తైన శిఖరంపై నిలిచిన ఏకశిల మీద వీచే గాలి కంఠానికి బిర్రటి గంటేసినంత నిశ్శబ్దం'.... భర్త కొట్టే దెబ్బలకు తాళలేక ఆమె 'రెక్కలూడిన ఊసిల్లలా వుండిపోయింది' అంటాడు మరోచోట.

ఈ నవలలో కురబల జీవన సమరాన్ని వర్ణించడంతో బాటు రచయిత వారి సంస్కృతికీ, సంప్రదాయాలకూ, నమ్మకాలకూ ప్రాధాన్యతనిస్తాడు. నవల ప్రారంభంలోనే కురబల ముఖ్య ఉత్సవమైన ఎర్రిపూల మారెమ్మ ఊరేగింపు వర్ణన కనిపిస్తుంది. ఈ ప్రారంభ ఎత్తుగడ నవలకే అందాన్నిచ్చింది. మరో సందర్భంలో ఆ గ్రామంలోని రాజకీయనేత చౌదరి గొర్రెల మంద తన చేనులోకి ప్రవేశిస్తే పంటలు బాగా పండుతాయని భావించి ఆ గొర్రెల కాపరులకు విందుభోజనం ఏర్పాటు చేస్తాడు. వానలు కురవనప్పుడు ఊరికి మంచి జరగాలని ఆడబిడ్డకు వొడిబియ్యం పోసే కార్యక్రమాన్ని ఆ వూరివాళ్లు ఎంత వైభవంగా జరిపిస్తారో వర్ణిస్తాడు రచయిత. ఈ నవల ముగింపులో 'నేటి కాలానికనుగుణంగా వృత్తిదారుడు మారకపోతే సమాజం ఆ వృత్తిని, వృత్తిదారులను మరచిపోతుంది' అంటూ కులవృత్తిదారులకు భవిష్యత్తును సూచిస్తూ కులవృత్తిలోని సంక్షోభం తొలగే మార్గాన్ని అన్వేషిస్తాడు. వృత్తిదారులు విద్యావంతులు కావాలని ఆకాంక్షిస్తాడు. జీవన సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూ నిరంతరం కులవృత్తిదారులు అనుభవించే నిలువెత్తు సంఘర్షణకు నిలువుటద్దమై నిలుస్తుంది ఈ నవల.

- డాక్టర్ కొత్వాలు అమరేంద్ర,
9177732414

## ఆ పెంకుటిల్లు..



ఆ పెంకుటిల్లు
మట్టి గోడల మధ్య మానవత్వం నిలిపిన గుడారం,
గాలి రాకపోయినా ఆత్మల సువాసనతో నిండిన గది,
నాన్న లేని శూన్యాన్ని పిన్నమ్మ అక్కున నింపిన
అమృతధారల ఆశ్రయం అది.

రైల్వే క్వార్టర్స్ లో
రైలు ఊపిరి పీల్చుకుంటూ నిద్రించిన రాత్రులు,
పెంకు పైకప్పు తడిసినా మనసు మాత్రం పొడిగానే
మమకారం పటిష్టమైన పైకప్పు కదా!

అమ్మ వెలిగించే మట్టిపొయ్యి దగ్గరే
చిన్న ఆశలు పొంగాయి,
పెద్ద విలువలు పుట్టాయి,
ఏడుగురు పిల్లల హాస్యంలో నాలుగు హృదయాలు
కలిసాయి,
పుస్తకాల సువాసనలో నైతికత బీజాలు మొలిచాయి.
అక్కయ్య పెళ్లి సంబరం,
అర్థాంతరంగా వెళ్లిన అన్నయ్య విషాదం,
ఆ ఇల్లు జ్ఞాపకాల ఆల్బమ్ లో
చెదరనివి.

ఇప్పుడు
కలుషిత కాలం చేత మనసులు మురికెక్కాయి,
నవ్వుల స్థానంలో శబ్దం,
ప్రేమల స్థానంలో నీడలు,
జీవం ఉన్న మనుషులు జీవం లేని జీవితాలు
గడుపుతున్నారు.

ప్రతి రాత్రి నిద్రకు ముందు
నాలో ఒక రైల్వే గంట మోగుతుంది,
ఒక పెంకుటిల్లు తలుపు మెల్లగా తెరుచుకుంటుంది,
ఆ దివ్యధామం లోంచి చిన్నాన్న నవ్వు వినిపిస్తుంది
"చిట్టీ, వెలుగు లోపలే ఉంది, వెలుపల కాదు!"

ఆ పెంకుటిల్లు ఇప్పటికీ నా మనసులో ఉంది
ఇల్లు కాదు అది,
నా వ్యక్తిత్వం మొదలైన పుట్టుగుడి.

- డాక్టర్ పెరుగు రామకృష్ణ, 9849230443

# భజగోవిందం గ్రంథావిష్కరణ



**ఆదిలాబాద్ మహా:** ప్రముఖ తెలుగు అనువాదకులు గురుదాస్ మిట్టపల్లి శంకరయ్య సంస్కృత మూలం నుండి అనువదించిన శ్రీశంకర విరచిత భజగోవిందం గ్రంథావిష్కరణ ఘనంగా జరిగింది. ఆదివారం పట్టణంలోని శ్రీరామ చంద్ర గోపాకృష్ణ మఠంలో మఠాధిపతి యోగానంద సరస్వతి, ప్రముఖ ప్రవచన కర్త కృష్ణానంద స్వామి చేతుల మీదుగా ఆవిష్కరించారు.చిన్నప్పటినుండి ఆధ్యాత్మిక విషయాలలో ఆసక్తి కారణంగా భగవత్ కృపచే ఇలాంటి అనువాదాలు చేసే అదృష్టం దక్కిందని శంకరయ్య అన్నారు. సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించడానికి తనకు నాలుగు సంవత్సరాల కాలం పట్టిందని ఆయన తెలిపారు.అనంతరం కృష్ణానంద స్వామి భక్తులను ద్దేశించి ఆధ్యాత్మిక అమృతోపన్యాసం చేసారు.ఈ కార్యక్రమంలో రచయిత కుటుంబసభ్యులు, భజన బృందం,భక్తులు పాల్గొన్నారు.

# 23న మాలల రణభేరి మహాసభ



**రెబ్బెన, మహా :** నవంబర్ 23 న హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియం లో జరిగే మాలల రణభేరి మహాసభ ను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రణభేరి మహాసభల కరపత్రాలను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ అనంతరం జరిగిన రోస్టర్ పాయింట్ల కేటాయింపు లో 5% కేటాయించిన గ్రూప్ 3 లోని మాలలకు , 1% ఉన్న గ్రూప్ 1 లోని కులాల కంటే విద్య, ఉద్యోగాలలో తక్కువ అవకాశాలు వస్తున్నాయని అన్నారు. మాలలకు జరిగిన అన్యాయంపై ప్రశ్నించడంతో పాటు ఎస్సీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని .. ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు. మాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యికోట్ల నిధుల కేటాయింపు డిమాండ్ లతో పాటు మాలల సామాజిక భవనం ఏర్పాటు చేయాలన్న తదితర డిమాండ్లు లేవనెత్తుతామన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి మాలలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షురాలు అనిల్,ప్రధాన కార్యదర్శి మేకల హనుమంతు మహిళ నాయకురాలు పాల్గొన్నారు.

## తిరుమల తిరుపతి దేవస్థాన మౌలిక వసతుల కల్పనకు కృషి

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి, మహా:** తిరుమల తిరుపతి దేవస్థానం లో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ పేర్కొన్నారు. తిరుమలలోని వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం ఆదివారం రోజు మధ్యాహ్నం 2 గంటలకు తిరుమలలోని క్యాంప్ కార్యాలయంలో టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా తిరుపతి తిరుమల దేవస్థానం అభివృద్ధి, భక్తులకు అందించే సేవలు, మౌలిక వసతుల విస్తరణ,తీర్థప్రసాదాల వ్యవస్థ, విచారణలో ఉన్న ఇతర విధానపరమైన అంశాలు వంటి పలు ముఖ్యమైన విషయాలపై ఇరువురు చర్చించారు.టీటీడీ అభివృద్ధి కార్యక్రమాలకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పూర్తి సహకారం అందజేస్తామని ప్రకటించారు.

# సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకం

- వరంగల్ లో ఘనంగా నేషనల్ ప్రెస్ డే వేడుకలు
- టీ ఎస్ జేయు నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయం
- మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ జి సంధ్యారాణి
- టి.ఎస్.జే.యు ఆధ్వర్యంలో ఉచిత వైద్య, నేత్ర పరీక్ష, రక్తదాన శిబిరం ఏర్పాటు





**వరంగల్, మహా;** సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, జర్నలిస్టుల స్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా ఎవ్వరూ ప్రవర్తించ కూడదని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా అడిషనల్ కలెక్టర్ జి సంధ్యారాణి తెలిపారు. ఆదివారం వరంగల్ నగరంలోని 22వ డివిజన్ పరిధి వాసవి కాలనీలో గల ఇన్నర్ వీల్ క్లబ్ లో తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ పత్రిక దినోత్సవాన్ని (నేషనల్ ప్రెస్ డే) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచిత వైద్య, నేత్ర పరీక్ష తోపాటు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి విచ్చేసి రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రక్తదానం ప్రాణ దానంతో సమానమని, ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్(టి.ఎస్.జే.యు) వరంగల్ జిల్లా బాధ్యులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అలాగే ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఎవ్వరూ కూడా ప్రవర్తించకూడదని ముఖ్యంగా సమాజంలో నెలకొన్న సమస్యలను వెలికి తీసి సమాజాభివృద్ధికి ప్రతి జర్నలిస్టు కృషి చేయాలని కోరారు. అంతేకాకుండా ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్న జర్నలిస్టు వృత్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. వృత్తి బాధ్యతతో పాటు సామాజిక బాధ్యతగా టీఎస్ జేయు ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అంటూ జర్నలిస్టులందరికీ నేషనల్ ప్రెస్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. టీఎస్ జేయు వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కందికొండ మోహన్, ఆవునూరి కుమారస్వామి మాట్లాడుతూ టీఎస్ జేయు రాష్ట్ర అధ్యక్షులు నారగొని పురుషోత్తం, రాష్ట్ర కార్యదర్శి అనిల్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో టీఎస్ జేయు అన్నివేళలా ముందుంటుందని, పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ జర్నలిస్టుల పై జరుగుతున్న దాడులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. జర్నలిస్టుల రక్షణ, సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. యూనియన్ల కు అతీతంగా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన జర్నలిస్టులందరికీ టీఎస్ జేయు పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సమాజం కోసం అహర్నిశలు కృషిచేసిన సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, బీజెపి జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, మట్వాడ ఇన్స్పెక్టర్ కరుణాకర్ రావు, ఇంతేజార్ గంజ్ ఇన్స్పెక్టర్ షుకూర్, ఏజే మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ రమేశ్, ఏవివి కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కోడిమాల శ్రీనివాసరావు, వరంగల్ మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గజ్జె గోవర్ధన్, టీఎస్ జె యు రాష్ట్ర నాయకులు నాగరాజు,నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఈద శ్రీనాథ్, గంగరాజు, కృష్ణ, కోశాధికారి సత్యం, కార్యవర్గ సభ్యులు శ్రీహరి, సురేష్, రాజు, అశోక్, అవినాష్, డా.దయాకర్ వైద్య బృందం, ఎంజీఎం బ్లడ్ బ్యాంకు సిబ్బంది, శరత్ ఐ హాస్పిటల్ సిబ్బంది తో పాటు జర్నలిస్టులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ముదిరాజ్ మహాసభ పోస్టర్ ను ఆవిష్కరించిన కార్పొరేటర్

**వరంగల్, మహా:** ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నవంబర్ 21వ తేదిన నిర్వహించబోయే తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం వరంగల్ నగరం 27 డివిజన్ పెద్దమ్మ గుడి ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముదిరాజ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు బయ్యస్వామి,స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, చింతాకుల సునీల్ కుమార్ విచ్చేసి పోస్టర్ ను ఆవిష్కరించారు. పెద్దమ్మ గుడి అధ్యక్షులు సత్య నారాయణ, ఇప్ప ఆది నారాయణ, సిరబోయిన మహేష్ బల్సుకూరి గోపి సిరబోయిన యాదగిరి, కురాకుల రవీందర్, నర్రా రాజేష్, వన్నాల వేణు, బండి సుధాకర్, నర్రా అశోక్ మహిళా సోదరిమణులు లక్క ధనలక్ష్మి, అరుణ, వాణి పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే






పలు శుభకార్యాలకు హాజరైన నన్నపునేని

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఆదివారం జరిగిన పలు శుభకార్యాలకు వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా హంటర్ రోడ్ లోని సత్యం కన్వెన్షన్ హాల్లో వరంగల్ జిల్లా మున్నూరు కాపు సంఘం కన్వీనర్ పోతు కుమారస్వామి కుమారుని నిశ్చితార్థ కార్యక్రమానికి గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో 34 డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమార్ స్వామి, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, వరంగల్ తూర్పు నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన భద్రకాళి దేవస్థానం ఆవరణలో వరంగల్ జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులు దుబ్బ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ కార్తీకమాస వన భోజన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆర్య వైశ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, సభ్యులు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త వాహనదారులకు ప్రభుత్వం షాక్

ఫ్యాన్సీ నంబర్ల ఫీజు మూడు రెట్లు పెంపు

**వరంగల్ హన్మకొండ మహా;** ఖరీదైన వాహనాలకు జాతకాల ప్రకారం లక్కీ నెంబర్ లేదా ఫ్యాన్సీ నెంబర్ల కోసం వేల నుండి లక్షల ఖర్చు పెట్టుకునే వారు ఉన్నారంటే అతిశయోక్తి లేదు. తెలంగాణ ప్రభుత్వం కొత్త వాహనదారులకు ఫ్యాన్సీ నంబర్లు కావాలనుకునే వారికి షాక్ ఇచ్చింది. ప్రత్యేక నంబర్ల రిజర్వేషన్ ఫీజులను అమాంతం మూడు రెట్లు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా 9999, 0009, 6666 వంటి నంబర్లకు ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ పెంపుతో ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పెరుగుతుందని అంచనాలు నెలకొన్నాయి. కాగా ఆన్లైన్ దరఖాస్తు, వేలం విధానంలో ఎలాంటి మార్పు లేదని తెలుస్తోంది.

# సోయా లారీల నిలిపివేత



**బోథ్ మహా:** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో తూకం చేసి గోదాం కు పంపించిన రెండు సొయాబీన్ లారీలను నాణ్యత లేని కారణంగా అక్కడ అధికారులు నిలిపివేశారు. దీంతో రైతులు ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ ను సంప్రదించారు. వెంటనే ఆయన ఫోన్ లో మార్కుఫెడ్ అధికారులతో మాట్లాడగా ఇప్పటికే అధిక వర్షాల వలన పంటలు రంగు మారాయని దీంట్లో రైతుల తప్పిదం ఏముందని అన్నారు. పంటలు ఎలా ఉన్న కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. గోదాం వద్ద ఉన్న సిబ్బంది ని అడిగి తెలుసుకుంటానని వారితో మాట్లాడతానని అధికారులు బదులిచ్చారు. మరోపక్క రైతులు సొసైటి సిబ్బంది తీరు పై అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంతమంది రైతులవి చెన్ని పట్టి తూకం చేస్తుంటే కొంతమంది రైతులవి ఇష్టరీతినా చెన్ని లేకుండానే తూకం వేస్తున్నారని ఆరోపించారు. ఒక్కొక్కరికి ఒక్కో నిబంధన ఉంటుందా అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కారు ఢీకొని సింగరేణి ఉద్యోగి మృతి



**మందమర్రి, మహా :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధి బురదగూడెం సమీపంలో జాతీయ రహదారిని దాటుతున్న తోట సతీష్ (59) అనే సింగరేణి ఉద్యోగిని కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. మందమర్రి ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం... అవసర నిమిత్తం మృతుడు రోడ్డు దాటుతుండగా బెల్లంపల్లి వైపు నుండి మంచిర్యాలకు వెళ్లే కారు బలంగా ఢీ కొట్టినట్లు తెలిపారు. దీనితో సతీష్ కుమార్ ఘటన స్థలంలోనే మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుని అల్లుడు సాయి చరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ఘటనా స్థలాన్ని బెల్లంపల్లి ఏసీబీ రవికుమార్, మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికులు బాటసారులు జాతీయ రహదారిపై అత్యంత జాగ్రత్తగా వాహనాలు నడపాలని, రోడ్డు దాటుతున్న క్రమంలో బాటసారులు రోడ్డు ఇరు పక్కన చూసి వెళ్లాలని వారు సూచించారు. ఈమధ్య ఈ ప్రాంతంలో వాహన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగా పట్టణంలో వాహన ప్రమాదాల నివారణ కొరకు అవగాహన సదస్సులు కూడా ఏర్పాటు చేశామని వెల్లడించారు. చిన్న అజాగ్రత్త వల్ల ప్రమాదం జరిగి నిండు ప్రాణం పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణం పోవడమే కాకుండా ఆర్థిక నష్టం జరుగుతుందని స్పష్టం చేశారు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. మృతుడు సతీష్ కుమార్ సింగరేణి కాలరీస్ కంపెనీ మందమర్రి ఏరియా కే.కే5 గనిలో మ్యాన్ వే యాక్టింగ్ క్లర్క్ గా విధులు నిర్వహిస్తున్నాడు. స్థానిక కార్మెల్ పాఠశాల సమీపంలో నివాసం ఉంది. సతీష్ కుమార్ మృతి చెందాడని పట్టణం సామాజిక మాధ్యమాలలో వ్యాపించడంతో అతని స్నేహితులు, బంధువులు, తోటి సింగరేణి ఉద్యోగులు ఘటనా స్థలానికి వెళ్లి కంటనీరు పెట్టారు.

## బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలి

మంచిర్యాల ఐబి చౌరస్తాలో బీసీల ధర్మపోరాట దీక్ష



**మంచిర్యాల, మహా :** బీసీ రిజర్వేషన్లను పార్లమెంటులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల ఐబి చౌరస్తా అంబేద్కర్ స్తూపం ముందర మంచిర్యాల బీసీ జేఏసీ సంఘం నేతలు ఆదివారం ధర్మ పోరాట దీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీసీ జేఏసీ మంచిర్యాల జిల్లా కో ఆర్డినేటర్ ఒడ్డేపల్లి మనోహర్, జాతీయబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీసీజేఏసీ జిల్లా నాయకులు డాక్టర్ నీలకంఠేశ్వర్ గౌడ్, సంగెపు ఎల్లయ్య, వైద్య భాస్కర్, రాజేశం గౌడ్ ల బృందం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు. సుప్రీంకోర్టు నిబంధనలకు అనుకూలంగా బీసీ రిజర్వేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తే కొంతమంది అగ్రకుల నాయకులు బీసీల రిజర్వేషన్లను సహించలేక తెలంగాణ హైకోర్టుకు వెళ్లారని వాపోయారు. బీసీలకు రావలసిన రిజర్వేషన్లను అడ్డుకోవడం మూలంగా స్థానిక సంస్థలలో బీసీలకు రావాల్సిన 42 శాతం రిజర్వేషన్ నిలిచిపోయిందని పేర్కొన్నారు. దీనిని నిరసిస్తూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బీసీల ధర్మపోరాట దీక్షను రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్నట్లు వివరించారు. కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వానికి పెద్దన్న పాత్ర పోషిస్తున్న బిజెపి ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి మద్దతుగా పార్లమెంటులో చట్ట సవరణ చేసి , 9వ షెడ్యూల్లో రిజర్వేషన్లను కల్పించాలని వారు డిమాండ్ చేశారు. మా న్యాయ పోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు, బీసీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్వహించే పోరాటాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా నాయకులు కొండిల్ల శ్రీనివాస్, కర్రె లచ్చన్న, కట్కోజుల రమణ, యాదబోయిన రాజన్న యాదవ్, సంగేపు ఎల్లన్న, వైద్య భాస్కర్, దేవసాని నాగరాజు, దుర్గం రాజేశం గౌడ్, సకినాల శంకర్, ముదారపు శేఖర్, మడ్డి వేణుగోపాల్, జాడ క్రాంతి కుమార్, ఎండి కాశీం తదితరులు ఉన్నారు. ఇంతకుముందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ను విమర్శిస్తే ఊరుకోం

నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గట్టు మల్లేష్



**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ను విమర్శిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్ హెచ్చరించారు. ఆదివారం ఆయన నెన్నెల మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ నాయకుడు కొయ్యల ఏమాజీకి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ను విమర్శించే అర్హత లేదన్నారు. ఏమాజీ ఎన్ని చోట్ల తాను లాయర్ అని చెప్పి అక్రమ వసూళ్లు చేశాడో తమ వద్ద చిట్టా ఉందని అన్నారు. ఎమ్మెల్యేపై అవాకులు చవాకులు పేలితే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. ఇప్పటికీ ఓపిక పట్టామని,ఇకముందు గాలి వార్తలతో ఆరోపణలు చేస్తే సహించబోమన్నారు.ఎలాంటి మచ్చ లేని ఎమ్మెల్యే గడ్డం వినోద్ పై బట్ట కాల్చి మీద పారేస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు.ఇకముందు ఎమ్మెల్యే పై అసత్య ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని గట్టి చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో నాయకులు తోటశ్రీనివాస్ పటేల్,చెన్నోజు శంకరయ్య, గట్టు బానేష్, తోడే బాపు, సందనవేణి రాజేష్,పున్నపురెడ్డి పోచి రెడ్డి, మోహిద్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ తరగతులను
# సద్వినియోగం చేసుకోండి

### భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోండి

- అంబేద్కర్ వర్సిటీ స్టడీ సెంటర్ ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్, కోఆర్డినేటర్ డాక్టర్ ఏకాంబరం
- బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ఇండక్షన్ ప్రోగ్రాం



**బెల్లంపల్లి, మహా:** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్,కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ ఏకాంబరంపిలుపు నిచ్చారు. ఆదివారం స్టడీ సెంటర్లో మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్, రెండవ సంవత్సరం మూడవ సెమిస్టర్, మూడవ సంవత్సరం ఐదవ సెమిస్టర్ విద్యార్థులకు ఇండక్షన్ కార్యక్రమం నిర్వహించారు.ఇందులో భాగంగా 202526 విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో తరగతులను ప్రారంభించారు. ..అన్నింటిపైఅవగాహన..ప్రస్తుతవిద్యా ద సంవత్సరంలో జరగనున్న తరగతులు,ప్రాక్టికల్స్,పరీక్షలు,ఫీజులు,సిలబస్, పుస్తకాలు, తదితర విషయాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ మాట్లాడుతూ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో చదివి కూడాఉజ్వల భవిష్యత్తును పొందిన విద్యార్థులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. తమ స్టడీ సెంటర్ ద్వారా వేలమంది విద్యార్థులు డిగ్రీ పట్టాలు పొందారని తెలిపారు. కోఆర్డినేటర్ ఏకాంబరం మాట్లాడుతూ,అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా చదువుకునే పుస్తకాలలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే బోలెడు అంశాలు ఉన్నాయని.. అవన్నీ విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఆకాంక్షించారు. బాగా చదివితే మంచి అవకాశాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, కోఆర్డినేటర్ డాక్టర్ ఏకాంబరం, తెలుగు కౌన్సిలర్ డాక్టర్ కంబాల మురళీ కృష్ణ,పొలిటికల్ సైన్స్ కౌన్సిలర్ కే. సమ్మక్క,స్టడీ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్టేట్ లెవెల్ కరాటే,కుంగ్ ఫు టోర్నమెంట్‌లో
# సత్తా చాటిన అభ్యాస విద్యార్థులు

విద్యార్థులను అభినందించిన అభ్యాస స్కూల్ కరెస్పాండెంట్ గుమాస ప్రవీణ్



**బెల్లంపల్లి, మహా:** స్టేట్ లెవెల్ ఐదవ కరాటే కుంగ్ ఫు టోర్నమెంట్ పోటీలలో అభ్యాస స్కూల్ కు సంబంధించిన విద్యార్థులు సత్తా చాటి పని పథకాలు సాధించినట్లు స్కూల్ కరెస్పాండెంట్ గుమాస ప్రవీణ్ తెలిపారు. బెల్లంపల్లి అభ్యాస స్కూల్ జరిగిన విలేకరుల సమావేశంలో స్కూల్ కరస్పాండెంట్ గుమాస ప్రవీణ్ మాట్లాడుతూ నస్పూర్ సిసి సింగరేణి కళావేదికలో కోల్డ్ బెల్ట్ ఏరియా కరాటే, కుంగ్ ఫు ఆర్గనైజర్ వెంకటేష్ ఆధ్వర్యంలో ఐదవ స్టేట్ లెవెల్ నేషనల్ కరాటే,కుంగ్ ఫు టోర్నమెంట్ జరిగిందని కార్యక్రమానికిముఖ్యఅతిథిగా కోదండరాం విచ్చేసి చేసి ప్రతిభ చాటిన విద్యార్థులకు పతకాలను అందజేసినట్లు తెలిపారు.స్టేట్ లెవెల్ టోర్నమెంట్లో అభ్యాస స్కూల్ విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచారని, అభ్యాస విద్యార్థులు చదువుల్లోనే కాకుండా,క్రీడల్లోనూ రణిస్తారని,విద్యార్థుల నైపుణ్యతను వెలికి తీయడంలో అభ్యాస స్కూల్ ముందంజలో ఉంటుందని, ప్రతి రంగంలోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ముందువరసలో ఉండేవిధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఐదవ ఓపెన్ స్టేట్ లెవెల్ నేషనల్ కరాటే,కుంగ్ ఫు టోర్నమెంట్ లో అభ్యాసస్కూల్ విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచారని 20 మంది గోల్డ్, పదిమంది సిల్వర్, నలుగురు బ్రోంజ్ మెడల్స్ సాధించారని వెల్లడించారు. అభ్యాస స్కూల్ యాజమాన్యం తరపున ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామని, చదువుల్లోనూ,క్రీడల్లోనూ, ఇతర అన్ని రంగాల్లో అభ్యాస స్కూల్ విద్యార్థులు ముందంజలో ఉండేవిధం గాయాజమాన్యం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యాస స్కూల్ విద్యార్థులు,కరాటే మాస్టర్ మల్లెపెల్లి జితేంద్ర పాల్గొన్నారు.

# సైబర్ మోసం కేసులో మరో ఇద్దరు అరెస్ట్



**సిర్పూర్ మహా :** కొమురం భీం ఆసిఫా బాద్ జిల్లా కాగజ్‌నగర్ టౌన్ పోలీస్ పరిధిలో జరిగిన 76 లక్షల 50వేల రూపాయల సైబర్ మోసం కేసులో పోలీసులు మరో ఇద్దరు కీలక నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వాట్సాప్ ట్రేడింగ్ గ్రూపులు సృష్టించి పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని నమ్మబలికి బాధితురాలిని మోసగించిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఇంతకుముందు ఏ1,ఏ2 లను అరెస్ట్ చేసిన పోలీసులు, వారి సమాచారంతో పూణేలో ఏ3 సంతోష్ తౌవర్ ను, అహ్మదాబాద్‌లో ఏ4 పటేల్ దవల్ కుమార్ ను పట్టుకున్నారు. వీరు నకిలీ బ్యాంక్ ఖాతాలు తెరిపించడం, మోసపూరిత లావాదేవీలకు సహకరించడం వంటి విషయాలను ఒప్పుకున్నారు. పూణే, అహ్మదాబాద్ లకు వెళ్లిన ఎస్ఐలు సుధాకర్, ప్రశాంత్, యాదగిరి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను డీఎస్పీ వాహిదుద్దిన్ అభినందించారు.

# సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం



**జైనూర్ మహా :** రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటలను విక్రయంచి మద్దతు ధర పొందాలని, కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి ,మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్ రావు సూచించారు. కుమురం భీమ్ అసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో సోయా బీన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్, అసిఫాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, సర్పంచుల సంఘం మాజీ జైనూర్ మండల అధ్యక్షులు మడావి భీమ్‌రావు, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంతరావు, మాజీ గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్ రావు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఇంతియాజ్ ఖాన్ లింగాపూర్ మాజీ జెడ్పిటిసి రుక్య లఖ్యానాయక్, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ




**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రోజు ఉదయం భవన నిర్మాణ కార్మికులకు నిరుపేదలకు కూలీలకు ఆటో డ్రైవర్లకు బాటసారులకు చిరు వ్యాపారస్తులకు 260 మందికి పైగా అల్పాహారం పంపిణీ చేయడం జరిగింది.అల్పాహార దాత కట్కూరి పద్మావతి శంకర్ షష్టిపూర్తి మహోత్సవం సందర్భంగా అల్పాహారం పంపిణీ చేయడమైంది. కార్యక్రమంలో తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రత్నం రాజన్న, రంగ రామన్న, కంటెవాడ నాగేష్ కుమార్,గెల్లీ జయరాం యాదవ్,ముత్తె వెంకట్రాజం,గంట శ్రీనివాస్, గరిగె రాజ్ కుమార్,గరిగె వేణు మాధవ్, పుల్లూరి సత్యనారాయణ,కొయ్యడ శంకర్గౌడ్, భీమిని కనకయ్య గౌడ్, గైని మల్లేష్, కందుల సత్తయ్య, మేదరవెని రాజేందర్, సుగుణాకర్, మహేందర్ రెడ్డి, కుంభ ఓదెలు,మోహన్ రావు, కన్యవేణి రాజేశం, తిప్పా రాజయ్య, నాగుల లింగయ్య, అల్పాహారం దాత కటుకూరి శంకర్ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఒక్క వారంలో బంగారం ఎందుకింత పెరిగింది?



బంగారం ధరలు రోజురోజుకు ఆకాశాన్ని అంటేలా పెరిగిపోతున్నాయి. దేశంలో పుత్తడి ధరల పెరుగుదల పసిడి ప్రియులను కలవరపెడుతోంది. గడిచిన వారం రోజుల్లో బంగారం ధరలు ఎంత మేర పెరిగాయి.. అందుకు కారణాలేంటి.. అన్న విషయాలను ఈ కథనంలో తెలుసుకుందాం.. దేశంలో బంగారం ధరలు గడిచిన వారం రోజుల్లో భారీగా ఎగిశాయి. 24 క్యారెట్ల బంగారం తులం (10 గ్రాములు) ప్రస్తుత ధర (నవంబర్ 16) రూ.1,25,080. ఇది వారం రోజుల క్రితం అంటే నవంబర్ 9న రూ.1,22,020. అంటే వారం రోజుల్లో రూ.3060 పెరిగిందన్న మాట. ఇక 22 క్యారెట్ల పసిడి విషయానికి వస్తే.. ప్రస్తుతం (నవంబర్ 16) దీని తులం ధర రూ.1,14,650లుగా ఉంది. ఇది నవంబర్ 9న రూ.1,11,850లుగా ఉండేది. ఒక్క వారంలోనే 10 గ్రాములకు రూ.2800 ఎగిసింది. ఒక్క వారంలోనే బంగారం ధరలు ఇంతలా పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఇటీవల బడ్జెట్ లో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ తగ్గించే అవకాశాలు పెరిగాయి. వడ్డీలు తగ్గితే, బంగారం మరింత ఆకర్షణీయంగా మారుతుంది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, రాజకీయ ఉద్రిక్తతలు బంగారానికి సురక్షిత ఆస్తిగా విలువను కల్పిస్తున్నాయి. దీంతో ఇన్వెస్టర్లు పసిడి కొనుగోళ్లకు మక్కువ చూపుతున్నారు. కొన్ని దేశాల కేంద్ర బ్యాంకులు తమ బంగారం నిల్వలను పెంచుకుంటున్నాయి. ఇది స్థిరమైన, దీర్ఘకాల డిమాండ్‌ను పెంచుతుంది. బంగారానికి సంబంధించిన ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు ఎక్కువవుతున్నాయి. సంస్థాగత పెట్టుబడిదారులు బంగారంపై ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. యూఎస్ డాలర్ బలం తగ్గడం కూడా బంగారం ధరలకు ఆజ్యం పోస్తోంది. బంగారం విలువ సాధారణంగా డాలర్లలో లెక్కిస్తారు. డాలర్ బలహీనంగా ఉంటే, ఇతర దేశాల పెట్టుబడిదారులు బంగారాన్ని తక్కువ ఖర్చుతో కొనగలరు.




## జీఎస్టీ ఎఫెక్ట్.. నిరాశపరిచిన ఎక్సైడ్ ఇండస్ట్రీస్


బ్యాటరీ తయారీ సంస్థ ఎక్సైడ్ ఇండస్ట్రీస్ సెప్టెంబర్ త్రైమాసికంలో పనితీరు పరంగా ఇన్వెస్టర్లను మెప్పించలేకపోయింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 26 శాతం తగ్గి రూ.174 కోట్లకు పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.233 కోట్లుగా ఉంది. ఆదాయం సైతం ఈ కాలంలో 2 శాతం తగ్గి రూ.4,364 కోట్లుగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ కాలంలో లాభం రూ.448 కోట్లుగా ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో లాభం రూ.454 కోట్లతో పోల్చి చూస్తే ఒక శాతం తగ్గింది. జీఎస్టీ (GST) రేట్ల మార్పు ప్రభావం సెప్టెంబర్ త్రైమాసికం పనితీరుపై ప్రభావం చూపించినట్టు కంపెనీ తెలిపింది. బ్యాటరీలపై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడాన్ని గుర్తు చేసింది. రేట్లు తగ్గిన తర్వాత కొత్త స్టాక్‌ను తెప్పించుకుందామని భాగస్వాములు భావించడంతో డిమాండ్ స్తబ్దుగా ఉన్నట్టు వివరించింది. లిథియం అయాన్ బ్యాటరీ ప్లాంట్ నిర్మాణం ఆశించిన విధంగా పురోగతిలో ఉన్నట్టు కంపెనీ ఎండీ, సీఈవో అవిక్‌రాయ్ తెలిపారు.

## ప్రమాదంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ: కియోసాకి



ఎప్పుడూ స్టాక్ మార్కెట్లను, బాండ్లను విమర్శించే ప్రముఖ పర్సనల్ ఫైనాన్స్ పుస్తకం 'రిచ్ డాడ్ పూర్ డాడ్' రచయిత రాబర్ట్ కియోసాకి.. తాజాగా మరో ఆసక్తికర ట్వీట్ చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ భారీ ప్రమాద దశలో ఉందని హెచ్చరించారు. ఆయన మాటల్లో.. ప్రపంచ మార్కెట్లలో ఏర్పడిన "ప్రతీ బుడగ" ఇప్పుడు పేలుతున్నదనీ, దీనితో పెద్ద ఎత్తున ధరలు పడిపోతున్నాయనీ తెలిపారు. అయితే, ఈ పరిణామాల మధ్య ఆయన తన ఆస్తులను (బంగారం, వెండి, బిట్‌కాయిన్, ఎథీరియం) అమ్మడం లేదని స్పష్టం చేశారు. 'ఎక్స్'(ట్విట్టర్)లో చేసిన వరుస పోస్టులలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రమాదం అంచున ఉందని వ్యాఖ్యానించిన కియోసాకి.. ప్రభుత్వాలు భారీ అప్పుల భారంతో కుప్పకూలే పరిస్థితిలో ఉన్నాయని, ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడానికి చివరకు అధిక స్థాయిలో డబ్బు ముద్రించడం తప్ప మరో మార్గం ఉండదని అన్నారు. అదే సమయంలో, అధిక ముద్రణ వల్ల డాలర్ విలువ పడిపోవడంతో "నకిలీ డబ్బు" క్రాష్ అవుతుందని, దాంతో సహజంగా విలువ కలిగిన కఠిన ఆస్తులు ధరలు పెరుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. క్రిప్టో మార్కెట్ లో భారీగా పడిపోయే ధోరణి గురించి ఆయన మాట్లాడుతూ.. "బిట్‌కాయిన్ క్రాష్ అవుతోంది, ప్రతీ బుడగలు పగులుతున్నాయి. నేను అమ్ముతున్నానా? లేదు. ఎందుకంటే ప్రపంచానికి డబ్బు అవసరం, నాకు కాదు" అని అన్నారు. కియోసాకి ప్రకారం.. భారీ అప్పు సంక్షోభం కారణంగా ప్రభుత్వాలు త్వరలో "ది బిగ్ ప్రింట్" (నోట్ల ముద్రణ) ప్రారంభించాల్సిన పరిస్థితి వస్తుంది. ఈ నేపథ్యంలో బంగారం, వెండి, బిట్‌కాయిన్, ఎథీరియం వంటి ఆస్తులు మరింత విలువను సంపాదిస్తాయని ఆయన నమ్మకం.

## జియో కొత్త రీచార్జ్.. 200 రోజుల చౌక ప్లాన్




టెలికాం రంగంలో అతిపెద్ద యూజర్ బేస్, రీఛార్జ్ ప్లాన్ల విస్తృత పోర్ట్‌ఫోలియోను కలిగి ఉన్న రిలయన్స్ జియో.. తన కస్టమర్ల కోసం తక్కువధర, హైఎండ్ విభాగాలలో విస్తృత శ్రేణి ప్లాన్‌లను అందిస్తోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ రోజులు సిమ్ కార్డును యాక్టివ్‌గా ఉంచుకోవాలనుకునే కస్టమర్ల కోసం దీర్ఘకాల వ్యాలిడిటీతో చౌక రీచార్జ్‌ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. మిలియన్ల మంది మొబైల్ వినియోగదారుల అవసరాలను గుర్తించి, జియో ఇప్పుడు దీర్ఘకాలిక వ్యాలిడిటీ రీఛార్జ్ ప్లాన్ల జాబితాలో చేర్చిన ప్లాన్ ధర రూ.2025. ఖరీదైన 365 రోజుల రీఛార్జ్ ప్లాన్ కొనడానికి ఇష్టపడని కస్టమర్లకు ఈ ప్లాన్ ఉత్తమ ఎంపిక. జియో ఈ ప్లాన్‌ను ఉత్తమ 5జీ ప్లాన్లలో ఒకటిగా లిస్ట్ చేసింది.

**ప్లాన్ ప్రయోజనాలు**

జియో తన రూ.2025 ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్ తో వినియోగదారులకు 200 రోజుల సుదీర్ఘ వాలిడిటీని అందిస్తుంది. అన్ని మొబైల్ నెట్ వర్క్ లకు 200 రోజుల పాటు అపరిమిత కాలింగ్ ను ఆనందించవచ్చు. ఇక డేటా ప్రయోజనాల విషయానికి వస్తే.. 200 రోజుల పాటు మొత్తం 500 జిబి డేటాను అందిస్తుంది. రోజుకు 2.5 జీబీ వరకు హై స్పీడ్ డేటాను వినియోగించుకోవచ్చు. ఇంకా ఈ ప్లాన్ లో రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు ఉన్నాయి. ఈ ప్లాన్ తో అపరిమిత 5జీ డేటాను ఆనందివచ్చు. జియో యూజర్లు ఈ ప్లాన్ తో కొన్ని అదనపు ప్రయోజనాలను కూడా పొందుతారు. ఈ ప్లాన్ లో మూడు నెలల పాటు జియో హాట్ స్టార్ కు ఉచిత సబ్ స్క్రిప్షన్ కూడా ఉంది. మీరు టీవీ ఛానెల్స్ చూడాలనుకుంటే జియో టీవీకి కూడా ఉచిత యాక్సెస్ పొందుతారు. డేటా స్టోరేజ్ కోసం 50 జీబీ జియో ఏఐ క్లౌడ్ స్టోరేజ్ కూడా ఈ ప్లాన్ లో ఉంది.


## విస్తరణ దిశగా అల్ట్రావయొలెట్



బెంగళూరుకు చెందిన ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్స్ తయారీ సంస్థ అల్ట్రా వయొలెట్ తమ కొత్త యూవీ స్పేస్ స్టేషన్‌ను విజయవాడలో ప్రారంభించింది. ఇందులో ఎక్స్-47, ఎఫ్77 మాక్ 2, ఎఫ్77 సూపర్‌స్ట్రీట్ తదితర వాహనాలు అందుబాటులో ఉంటాయి. చూడటానికి స్టైలిష్ డిజైన్ కలిగిన అల్ట్రా వయొలెట్ ఎలక్ట్రిక్ బైకులు.. ఎందుకుని వేరియంట్‌ను బట్టి 2.8 సెకన్లలో గంటకు 60 కి.మీ. వేగాన్ని అందుకోగలవు. ఒక్కసారి చార్జి చేస్తే 323 కి.మీ. వరకు రేంజ్ ఉంటుంది. ఈ బైకులు ప్రస్తుతం దేశీయ విఫణిలో మాత్రమే కాకుండా.. గ్లోబల్ మార్కెట్లో కూడా అమ్మకానికి ఉన్నాయి. ఇవి అత్యుత్తమ పనితీరును అందించడం వల్ల ఎక్కువమంది.. ఈ బైకులను ఇష్టపడి కొనుగోలు చేస్తుంటారు.



# జమ్ము కశ్మీర్ పేలుడు



జమ్ము కశ్మీర్‌లోని నౌగం పోలీసు స్టేషన్ వద్ద జరిగిన పేలుడులో దర్జీ మరణంతో ఆయన కుటుంబం ఏకాకిగా మారింది. ఆ కుటుంబానికి ఆయన ఒక్కరే ఆధారం. పోలీస్‌స్టేషన్‌లో చిన్న ప్యాకింగ్ పని ఉందని రమ్మంటే వెళ్లిన స్థానిక టైలర్ మొహమ్మద్ షఫీ పారీ మళ్లీ తిరిగిరాలేదు. పేలుడు ఘటనలో ఆయన ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబం అనాథగా మారింది. 47 ఏళ్ల షఫీకి స్థానికంగా ఎంతో మంచి పేరుంది. మసీదులో కార్యక్రమాల కోసం విరాళాలు సేకరిస్తారు. చుట్టుపక్కల వాళ్లను ప్రేమగా పలకరిస్తాడు. ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో తండ్రి భోజనం కోసం ఇంటికి వచ్చినప్పుడు.. చలి కారణంగా ఇంట్లోనే ఉండాలని కుమార్తె వేడుకుంది. నాన్నా.. వెళ్లొద్దంటూ ఆమె ఎంతగానో వారించింది. కానీ ఆయన పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి పని పూర్తి చేయాల్సి ఉందని వెళ్లిపోయారు. రాత్రి 11.20గంటలకు ఈ ప్రమాదం సంభవించింది. పని పూర్తి చేసి తిరిగి వస్తానని ఆయన చెప్పిన చివరి మాటలు తలచుకుంటూ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. కాగా, టైలర్ మొహమ్మద్ షఫీ పారీని పోలీసులు.. పేలుడు పదార్థాల ప్యాకెట్ల కోసం సంచులు కుట్టించడానికి స్టేషన్‌కి తీసుకెళ్లారు. ఇటీవల హర్యానా ఫరీదాబాద్‌లో స్వాధీనం చేసుకున్న భారీ పేలుడు పదార్థాల నుండి నమూనాలు సేకరిస్తున్న సమయంలో భారీ పేలుడు సంభవించింది. నిబంధనావళి ప్రకారం పేలుడు పదార్థాల నుంచి కొంతమేర శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపేందుకు ప్రయత్నిస్తుండగా అవి ఒక్కసారిగా పేలిపోయి 9 మంది ప్రాణాలను బలిగొంది. ఫోరెన్సిక్ సైన్స్ లేబోరేటరీ టీమ్‌లోని ముగ్గురు, ఇద్దరు క్రైమ్ ఫొటోగ్రాఫర్లు, మేజిస్ట్రేట్ బృందంలోని ఇద్దరు రెవెన్యూ శాఖ అధికారులు, స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అధికారి, ఒక టైలర్ చనిపోయారు. ఇద్దరు రెవెన్యూ అధికారులు, ముగ్గురు పౌరులు సహా 27 మంది గాయపడ్డారు.

# కూలిన రాతి గని..

## శిథిలాల కింద 15 మంది కార్మికులు



**సోనభద్ర:** ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. సోన్ భద్రలో గని కూలిపోయింది. శిథిలాల కింద 15 మంది కార్మికులు చిక్కుకున్నారు. ఒక మృతదేహాన్ని రెస్క్యూ సిబ్బంది వెలికీ తీశారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సోనభద్రలోని ఒబ్రా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బిల్లీ మార్కుండి మైనింగ్ ప్రాంతంలో శనివారం రాత్రి ఆ ఘటన జరిగింది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ పాటు రెండు ప్రైవేట్ కంపెనీల రక్షణ బృందాలు, ఒబ్రా థర్మల్ పవర్ ప్రాజెక్ట్ బృందం రక్షణ చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ బద్రినాథ్ సింగ్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆయన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అదనపు పరికరాలు, యంత్రాలతో సహాయక చర్యలు చేపడుతున్నామని ఆయన చెప్పారు. ప్రమాద సమయంలో తొమ్మిది కంప్రెసర్లు పనిచేస్తుండగా, ప్రతి కంప్రెసర్ వద్ద ఒక్కొక్కరు విధులు నిర్వహిస్తున్నట్టు సమాచారం. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

## అమెరికాలో కొత్త వైరస్ కలకలం




అమెరికాలో కొత్త రకం వైరస్ కలకలం రేపుతోంది. వాషింగ్టన్ కు చెందిన ఓవ్యక్తికి బర్డ్ ఫ్లూ సోకడంతో ఆసుపత్రిలో చేరారు. దీంతో ఆ వ్యక్తికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు అతనికి " హెచ్5 ఎన్5 ఏవియన్ ఇన్‌ఫ్లూయింజా" అనే కొత్తరకం వైరస్ సోకినట్లు గుర్తించారు. ఇటువంటి వైరస్ మానవులలో సోకడం ఇది మొదటిసారని డాక్టర్లు తెలిపారు. వాషింగ్టన్ లోని ఓ వ్యక్తికి "ఎచ్5ఎన్5 ఏవియన్ ఇన్‌ఫ్లూయింజా" వైరస్ సోకడం ప్రస్తుతం అమెరికాలో కలకలం రేపుతోంది. సాధారణంగా ఈ వైరస్ మనుషులకు అంటుకోదని కానీ ఈ వ్యక్తికి ఎలా సోకిందనే విషయాలను అధ్యయనం చేస్తున్నామని డాక్టర్లు తెలిపారు. బాధితుడు బహుశా కోళ్ల ద్వారనే వైరస్ వ్యాపించి ఉండవచ్చని భావిస్తున్నారు. అయితే ఈ వైరస్ సోకిన వ్యక్తి వృద్ధుడని అతనికి ఇతర ఆరోగ్యసమస్యలున్నాయని డాక్టర్లు తెలిపారు. సాధారణంగా ఇన్‌ఫ్లూయింజా వైరస్ జంతువులలోనే వ్యాపిస్తుందని ఈ వైరస్ సోకిన జంతువుల లాలాజలం, మలపదార్థాలు, పాడి పశువుల పాల ద్వార వేరే ప్రాణులకు సోకే అవకాశం ఉందని తెలిపారు. ఇది ఒకప్రాణి నుంచి మరో ప్రాణికి సోకే అవకాశం శీతాకాలంలో మరింత అధికంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం వైరస్ సోకిన వ్యక్తితో సన్నిహితంగా ఉన్న వ్యక్తుల వివరాలు సేకరిస్తున్నామని వారికి కూడా వైరస్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్లు పేర్కొన్నారు. అమెరికాలో బర్డ్ ఫ్లూ వైరస్ కేసు రావడం గడిచిన తొమ్మిది నెలల్లో ఇదే తొలిసారని అక్కడి వైద్యశాఖ ప్రకటించింది. ఈ వైరస్ మనుషులలో అంత ప్రభావం చూపే అవకాశాలు లేవని అయితే అలా అని దానిని తేలికగా తీసుకోకూడదని డాక్టర్లు తెలిపారు. బర్డ్ ఫ్లూ కేసులు నమోదైన నేపథ్యంలో ప్రజలంతా జాగ్రత్త పాటించాలని ఆరోగ్యశాఖ తెలిపింది. కోళ్ల పరిశ్రమలలో విధులు నిర్వహించే కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.



## పాక్‌లో బడిబయట 2.5 కోట్ల బాలలు

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ వ్యాప్తంగా కనీసం 2.5 కోట్ల మంది బాలలు బడిబయటే ఉన్నారు. వీరిలో కనీసం 2 కోట్ల మంది బడి ముఖమే ఎరుగరు. ఏ విద్య సంస్థలోనూ పేరు నమోదు చేయించుకోని 1,084 మంది ట్రాన్స్ జెండర్ బాలలు సైతం వీరిలో ఉన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాకిస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(పీఐఈ) విడుదల చేసిన నివేదిక మీడియాలో ప్రసారమవుతోంది. అందరికీ విద్య అందుబాటులో లేదనే విషయం ఈ నివేదికతో స్పష్టమవుతోందని సామాజికవేత్తలు అంటున్నారు. స్కూలుకు వెళ్లని బాలలు అత్యధికంగా 96 లక్షల మంది పంజాబ్ ప్రావిన్స్‌లో ఉన్నారు. ఆ తర్వాత సింధ్‌లో 78 లక్షలు, ఖైబర్ ప్రావిన్స్‌లో 49 లక్షలు, బలూచిస్తాన్‌లో 29 లక్షలమంది బాలలు అక్షరజ్ఞానానికి నోచుకోవడం లేదని నివేదిక తెలిపింది. సాక్షాత్తూ దేశ రాజధాని ఇస్లామాబాద్‌లో 6-16 ఏళ్ల మధ్యనున్న కనీసం 89 వేల మంది బాలలు బడి బయటే గడుపుతున్నట్లు పీఐఈ తెలిపింది. దేశంలో ఇటువంటి వారి సంఖ్య ఏడాదికి 20వేల చొప్పున పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేసింది.

# కళ్లెదురుగా మరణం



పులి కడుపున పులే పుడుతుందంటారు. లెజెండరీ యాక్షన్ డైరెక్టర్ వీరు దేవ్‌గణ్ ఎన్నో సినిమాలకు స్టంట్ మాస్టర్‌గా చేశారు. కొన్ని చిత్రాలకు యాక్షన్ కొరియోగ్రఫీ చేశారు. తన శరీరంలో ఎన్ని ఎముకలు విరిగినా సరే ఏమాత్రం జంకకుండా ఎన్నో సినిమాలకు స్టంట్‌మెన్‌గా వ్యవహరించారు. తండ్రి ధైర్యమే కొడుక్కీ వచ్చింది.

### ప్రాక్టీస్ చేయకుండా దూకేశాడు

బాలీవుడ్ హీరో అజయ్ దేవ్‌గణ్ (Ajay Devgn) కూడా సాహసోపేతమైన సన్నివేశాలకు వెనకడుగు వేయడు. దేదే ప్యార్ దే 2లోనూ అలాంటి స్టంట్లు చేశాడు. 'విమానంలోనుంచి దూకే సన్నివేశం అది.. కనీసం ఒక్కసారి కూడా ప్రాక్టీస్ చేయకుండానే విమానంలో నుంచి సడన్‌గా దూకి స్కైడైవింగ్ చేశాడు' అని నటుడు మాధవన్ అజయ్ గురించి గొప్పగా చెప్పాడు.

### కళ్ల ముందే ఓ ప్రాణం

ఇంతలో అజయ్ అందుకుంటూ.. నేను షూటింగ్ లొకేషన్‌కు వెళ్లగానే ఓ బాధాకర సంఘటన జరిగింది. నా కళ్లముందే ఒక వ్యక్తి పారాచూట్ పని చేయక లోయలో పడి చనిపోయాడు. తర్వాత నావంతు వచ్చింది. ఇది ప్రమాదకరమైనప్పటికీ నేనే రిస్క్ చేసి దూకుతున్నాను తప్ప ఎవరి బలవంతం లేదు అని ఓ వీడియో రికార్డ్ చేసి నా సీన్ పూర్తి చేశాను.

## ఆ హీరోకీ తప్పలేదు!

హాలీవుడ్ స్టార్ లినార్డో డికాప్రియోకి కూడా ఈ లొకేషన్‌లో చేదు అనుభవం ఎదురైంది. ఒకసారి సినిమా షూటింగ్‌లో భాగంగా ఇక్కడే స్కైడైవింగ్ చేశాడు. అతడి పారాచూట్ పనిచేయకపోయేసరికి అక్కడున్న ఇన్‌స్ట్రక్టర్ వెంటనే దూకి అతడి ప్రాణాలు కాపాడాడు అని గుర్తు చేసుకున్నాడు.

# నాకు పర్సనల్ ఫోన్ నంబర్ లేదు



తెలంగాణలోని వనపర్తి సంస్థానికి చెందిన అదితీ రావు హైదరీ ప్రస్తుతం హీరోయిన్‌గా తెలుగు, తమిళ, హిందీ సినిమాలు చేస్తోంది. హీరో సిద్దార్థ్‌ని పెళ్లి చేసుకుని ప్రస్తుతం ఫ్యామిలీ లైఫ్ ఎంజాయ్ చేస్తోంది. అయితే ఈమె పేరు చెప్పి ఓ వ్యక్తి.. పలువురు ఫొటోగ్రాఫర్స్‌ని మోసం చేస్తున్నాడు. ఇది అదితీ దృష్టికి వచ్చేసరికి స్వయంగా దీని గురించి సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టి హెచ్చరించింది. 'వాట్సాప్‌లో నా పేరుతో ఎవరో ఓ వ్యక్తి.. ఫొటోషూట్స్ కోసం పలువురు ఫొటోగ్రాఫర్స్‌కి మెసేజులు చేస్తున్నాడు. కొందరు వ్యక్తులు ఈ విషయాన్ని నా దృష్టికి తీసుకొచ్చారు. అయితే అది నేను కాదు. ఇలా నేను మెసేజ్ చేయను. చెప్పాలంటే నాకు వ్యక్తిగత ఫోన్ నంబర్ ఏం లేదు. నా టీమ్ ద్వారా నేను సంప్రదిస్తాను. కాబట్టి ఆ నంబర్ నుంచి మెసేజులు ఏమైనా వస్తే స్పందించొద్దు' అని అదితీ రావ్ హైదరీ తన ఇన్ స్టాలో పోస్ట్ పెట్టింది. సదరు మోసగాడి నంబర్ కూడా వెల్లడించింది. 2006 నుంచి అదితీ సినిమాలు చేస్తోంది. తెలుగు, తమిళ, మలయాళ, మరాఠీ, హిందీ భాషల్లో నటించింది. టాలీవుడ్‌లో 'సమ్మోహనం' ఈమెకు తొలి మూవీ. తర్వాత అంతరిక్షం, వీ, మహాసముద్రం చిత్రాల్లో నటించింది. 'సమ్మోహనం'తో హిట్ కొట్టినప్పటికీ మిగిలనవన్నీ ఫెయిల్ అయ్యాయి. 'మహాసముద్రం'లో నటిస్తున్న టైంలో హీరో సిద్ధార్థ్‌తో అదితీ ప్రేమలో పడింది. తర్వాత మూడేళ్ల పాటు ప్రేమించుకుని 2024లో వీళ్లిద్దరూ ఒక్కటయ్యారు.

## మన దేశం తరపున ఆస్కార్ బరిలో..

# ఇప్పుడు ఓటీటీలోకి



వచ్చే ఏడాది ఆస్కార్ బరిలో ఉన్న ఇండియన్ సినిమా 'హౌమ్ బౌండ్'. ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో అఫీషియల్‌గా దీనికి ఎంట్రీ దొరికింది. థియేటర్లలోకి రావడానికి ముందే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్, టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమై ప్రశంసలు కూడా అందుకుంది. అలాంటిది ఇప్పుడు ఈ మూవీ ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైపోయింది. ఇంతకీ ఈ సినిమా సంగతేంటి? ఎందులో స్ట్రీమింగ్ కానుంది. ఇషాన్ ఖట్టర్, విశాల్ జెత్వా, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించారు. కరోనా కష్టాలు, కులం కారణంగా ఎదురయ్యే అవమానాలు, ఉద్యోగాల్లో ఎదురయ్యే అణిచివేత, ఆర్థిక అసమానతలు తదితర అంశాలని తీసుకుని ఈ సినిమా తీశారు. పలు చిత్రోత్సవాల్లో ప్రశంసలు అందుకోగా.. సెప్టెంబరు 26న థియేటర్లలో రిలీజ్ చేశారు. యావరేజ్ టాక్ దగ్గరే ఆగిపోయింది. ఇప్పుడు ఈ చిత్రం నవంబరు 21 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. 'హౌమ్ బౌండ్' విషయానికొస్తే.. మహమ్మద్ షోయబ్ అలీ (ఇషాన్ ఖట్టర్), చందన్ కుమార్ (విశాల్ జెత్వా) ఫ్రెండ్స్. వీళ్లిద్దరూ ముస్లిం, దళిత వర్గానికి చెందిన వాళ్లు కావడంతో సమాజంలో అవమానాలు, అణిచివేతకు గురవుతారు. దీంతో పోలీస్ కానిస్టేబుల్ అయితే తమకు గౌరవం లభిస్తుందని వీళ్లిద్దరూ భావిస్తారు. పరీక్ష రాస్తారు. ఫలితాలు రావడం ఆలస్యం కావడంతో కుటుంబ పరిస్థితుల కారణంగా ఓ కంపెనీలో అలీ ఉద్యోగానికి చేరతాడు. సుధ (జాన్వీ కపూర్) కోసం చందన్ కాలేజీలో చేరతాడు. మరి కలిసి ఉండే అలీ, చందన్ మధ్య గొడవలు ఎందుకొచ్చాయి? కాలేజీ మానేసిన చందన్.. ఆఫీస్ బాయ్ ఉద్యోగం వదిలేసిన షోయబ్.. సూరత్ వెళ్లి ఫ్యాక్టరీలో పనికి ఎందుకు చేరారు? వీరిద్దరి జీవితాల్లో కరోనా ఎలాంటి మార్పు తీసుకొచ్చింది? అనేది మిగతా సినిమా. ఇద్దరు స్నేహితులుగా ఇషాన్ ఖట్టర్, విశాల్ జెత్వా అద్భుతంగా నటించారు. ఓ చిన్న పాత్రలో ఎలాంటి మేకప్ లేకుండా జాన్వీ కపూర్ ఆకట్టుకుంది.



# టైటిల్ రివీల్ కోసమే ఈ రేంజులో ఖర్చు పెట్టారా?

మహేశ్ బాబురాజమౌళి సినిమాకు 'వారణాసి' టైటిల్ ఫిక్స్ అయింది. నిన్నటివరకు రకరకాల పేర్లు వినిపించాయి గానీ చివరకు దీనికి జక్కన్న కట్టుబడి ఉన్నారు. అయితే శనివారం రాత్రి హైదరాబాద్‌లో 'గ్లోబ్ ట్రాటర్' ఈవెంట్ పేరిట భారీ ఎత్తున ప్లాన్ చేశారు. చిన్న చిన్న ఇబ్బందులు మినహా ఇది గ్రాండ్ సక్సెస్ అయింది. ఇంతకీ ఈ కార్యక్రమం కోసం ఎంత ఖర్చు పెట్టారు? సోషల్ మీడియాలో వినిపిస్తున్న టాక్ ఏంటి? సాధారణంగా రాజమౌళి కొత్త సినిమా తీస్తుంటే మీడియా మీట్ పెట్టి ప్రాజెక్ట్ వివరాలు వెల్లడిస్తుంటారు. ఈసారి మాత్రం ఒక్క విషయం కూడా బయటకు రాకుండా జాగ్రత్తపడ్డారు. ఏడాది క్రితమే టైటిల్, గ్లింప్స్ లాంటివి రివీల్ చేయాలని ప్లాన్ చేసుకున్నారు. తాజాగా జరిగిన గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్‌లో స్వయంగా రాజమౌళి ఇదంతా చెప్పాడు. అయితే అనివార్య కారణాల వల్ల ఆలస్యమవుతూ ఇన్నాళ్లకు కుదిరిందని అన్నారు. టైటిల్ లాంచ్‌ని ఏదో ఆషామాషీగా కాకుండా 100x130 అడుగుల ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి, మూవీకి సంబంధించిన స్పెషల్ వీడియోని దీనిపై ప్లే చేశారు. కేవలం ఈ స్క్రీనింగ్ సెటప్ కోసమే రూ.30 లక్షలకు పైగా ఖర్చు చేశారట. మొత్తంగా కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఖర్చులు కలిపి రూ.1015 కోట్ల వరకు అయినట్లు టాక్ వినిపిస్తుంది. ఒకవేళ ఇదే నిజమైతే మాత్రం ఇండస్ట్రీలో ఇదో రికార్డ్ అవుతుంది. ఎందుకంటే టీజర్ కోసమో, గ్లింప్స్ వీడియో కోసమే ఖర్చు చేయడం లాంటివి విని ఉన్నాం. కానీ మూవీకి సంబంధించిన టైటిల్ లాంచ్ కోసమే ఏకంగా ఈ రేంజులో కోట్లు ఖర్చు పెట్టారంటే.. రాబోయే రోజుల్లో ఇంకే స్థాయిలో ఖర్చు పెడతారో అనిపిస్తుంది. ఇప్పటివరకు పాన్ ఇండియా సినిమాలు తీసిన రాజమౌళి.. ఈసారి ప్రపంచవ్యాప్తం ఆడియెన్స్‌ని ఆకట్టుకోవాలనే ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. గ్లింప్స్ చూస్తే అది అనిపించింది కూడా.



# కోర్టు నటి శ్రీదేవికి తమిళ్ మరో ఛాన్స్

టాలీవుడ్‌లో 'కోర్ట్' సినిమాతో నటి శ్రీదేవి పాపులర్ అయిపోయింది. అదే ఊపులో తమిళంలో ఒకటి, తెలుగులో ఒకటి రెండు చిత్రాలు చేస్తోంది. కొన్నిరోజుల క్రితమే సొంతంగా కారు కూడా కొనుక్కుంది. తమిళంలో కేజేఆర్ అనే నటుడు, నిర్మాత తీయబోతున్న కొత్త చిత్రంలో శ్రీదేవిని కథానాయికగా ఇప్పటికే ఎంచుకున్నాడు. ఈ సినిమా ప్రారంభోత్సవానికి ప్రభుదేవా సహా పలువురు తమిళ సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఇప్పుడు మన శ్రీదేవి తమిళ్‌లో రెండో సినిమాకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. కోలీవుడ్‌లో వైవిధ్య భరిత కథాచిత్రాలను నిర్మిస్తున్న సంస్థ విజన్ సినిమా హౌస్. ఈ సంస్థ అధినేతలు డాక్టర్ అరుళానందు, మ్యాథ్యు అరుళానందు ప్రతిభావంతులైన నటీనటులను, సాంకేతిక వర్గాన్ని ప్రోత్సహించే విధంగా చిత్రాలు నిర్మిస్తున్నారు. ఇప్పుడు శ్రీదేవికి వారు సినిమా ఛాన్స్ ఇచ్చారు. ఇదే బ్యానర్ నుంచి నిర్మించిన జో చిత్రం మంచి విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత నటుడు 'ఏగన్' ను కథానాయకుడిగా పరిచయం చేస్తూ శీను రామస్వామి దర్శకత్వంలో కోళి పన్నై చెల్లదురై అనే వైవిధ్యభరిత కథా చిత్రాన్ని నిర్మించి సక్సెస్ తో పాటు ప్రశంసలను అందుకున్నారు. తాజాగా తమ మూడో చిత్రాన్ని నిర్మించడానికి వారు సిద్ధమయ్యారు. ఇందులో జో, కోళిపన్నై చెల్లదురై చిత్రాలతో పాపులర్ అయిన నటుడు ఏకన్ కథానాయకుడిగా నటిస్తున్నారు. కాగా ఇందులో కోర్ట్ ఫేమ్ శ్రీదేవి, మలయాళ చిత్రం బ్రూస్ లీ బిజీ ఫేమ్ ఫెమినా జార్జ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇందులో నటించే ఇతర నటీనటులు, సాంకేతిక వర్గం వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు నిర్మాతల వర్గం పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఆహా కళ్యాణం చిత్రం ఫేమ్ యువరాజ్ చిన్నస్వామి కథ దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com